నమ్మలేని నిజాలు

పిట్టలు లేవు
పిట్టల దొరలేరు
ఫోటో ఆల్బమ్.

ప్రజా రాజ్యాంగం
అరచేతిలో స్వర్గం
మరి నరకం.

ఓడి గెల్చింది
దిగనన్నది కుర్చీ
సగం ఊడింది.

ఓట్ల దొంగలు
వాళ్ల సీట్ల చోరులు
పర నిందలు.

జన్యుల గుట్టు
చికిత్సలు మెరుగు
సరైన మందు.

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

హైద్రాబాద్ మెట్రో కథ
వింటారా ఈ వివరణ !
ఇప్పట్లో లేనట్లే
రెండో దశకు విస్తరణ !
ఆంబోతులెవరైతేమి
లేగదూడ మెట్రో !
జాతీయుల కరవాలన
బదులుకున్న కుట్రో ?

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



శ్రీనిజం

హైదరాబాద్ గురువారం 18-6-2026   NETI NIZAM Telugu Daily,   RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.   సంపుటి :32   సంచిక:242   పేజీలు:6   వెల: రూ.1/-


# టెలిగ్రామ్ పిటిషన్‌పై అత్యవసర విచారణకు అంగీకరించిన ఢిల్లీ హైకోర్టు!

న్యూఢిల్లీ, జూన్ 17: ప్రముఖ సోషల్ మీడియా మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్' భారత ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు మెట్లెక్కింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'నీట్' పరీక్షల లీకేజీ వ్యవహారాలు, అవకతవకల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఈ నిషేధాన్ని వ్యతిరేకిస్తూ టెలిగ్రామ్ సంస్థ ఢిల్లీ హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేసింది.

కేంద్రం తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయం వల్ల భారతదేశంలోని కోట్లాది మంది వినియోగదారులతో పాటు తమ వ్యాపార ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని టెలిగ్రామ్ యాజమాన్యం తమ పిటిషన్‌లో పేర్కొంది. ఈ నిషేధాన్ని తక్షణమే ఎత్తివేయాలని కోరుతూ అత్యవసరంగా విచారించాలని కోర్టును అభ్యర్థించింది. టెలిగ్రామ్ సంస్థ అభ్యర్థనను పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు, ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ జరిపేందుకు అంగీకరించింది.

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ (ఔఇఖ) ఎగ్జామ్ ప్రశ్నాపత్రాల లీకేజీ, సమాధానాల కీ (ఒనిబలివతీ ఐవఎబ)ల సర్క్యులేషన్ వంటివి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానళ్ల ద్వారానే పెద్ద ఎత్తున సాగాయనే ఆరోపణలు వచ్చాయి. దర్యాప్తు సంస్థల నివేదికలు, అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, తదుపరి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఐటీ శాఖ ఈ తాత్కాలిక నిషేధాన్ని విధిస్తూ నిర్ణయం తీసుకుంది.

గత కొన్ని రోజులుగా ప్రశ్నపత్రాల లీకేజీ ముఠాలు, అక్రమార్కులు విద్యార్థులను ఆకర్షించడానికి, రహస్య సమాచారాన్ని చేరవేయడానికి ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ కలిగిన టెలిగ్రామ్‌ను వేదికగా చేసుకుంటున్నారనే ఫిర్యాదులు పెరిగాయి. ఈ నేపథ్యంలో కోర్టు విచారణలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వాదనలు వినిపిస్తుంది. ఢిల్లీ హైకోర్టు టెలిగ్రామ్‌కు ఊరటనిస్తుందా లేదా అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.

# మ్యాప్‌లో ఇండో పేరు తొలగించి..భారత్‌కు షాకిచ్చిన అమెరికా..

న్యూఢిల్లీ, జూన్ 17: ఫ్రాన్స్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య ద్వైపాక్షిక భేటీ జరుగుతున్న సమయంలో చోటు చేసుకున్న ఓ కీలక పరిణామం ఇరు దేశాల మధ్య సమస్యలను సృష్టించేలా కనిపిస్తోంది. అమెరికా తన కీలక సైనిక కమాండ్ అయిన 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్' పేరును మార్చింది. 'ఇండో'ను తొలగించి 'యునైటెడ్ స్టేట్స్ పసిఫిక్ కమాండ్' అని నామకరణం చేసింది

ఈ సైనిక కమాండ్ ఎక్కడెక్కడ పని చేస్తుందో తెలుపుతూ తమ వెబ్‌సైట్‌లో అమెరికా రక్షణ శాఖ ఓ మ్యాప్‌ను ఉంచింది. ఆ మ్యాప్‌లో 'పాక్ ఆక్రమిత కశ్మీర్'ను పాకిస్థాన్‌లో భాగంగా చూపించింది. దీంతో వివాదం మరింత ముదిరింది. కాగా, సైనిక కమాండ్ పేరు మార్పు కేవలం చారిత్రక వారసత్వాన్ని పునరుద్ధరించడానికేనని, కమాండ్ బాధ్యతలు, వ్యూహాత్మక లక్ష్యాలు లేదా కార్యకలాపాల్లో ఎలాంటి మార్పు ఉండదని అమెరికా రక్షణ శాఖ స్పష్టం చేసింది.

1947 జనవరి 1న నాటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ట్రుమ్యాన్ యూఎస్ పసిఫిక్ కమాండ్‌ను ఏర్పాటు చేశారు అమెరికా వెస్ట్ కోస్ట్ నుంచి భారత పశ్చిమతీరం వరకు గత ఏడు దశాబ్దాలుగా ఈ కమాండ్ సేవలందిస్తోంది. అయితే ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడు అయిన తర్వాత 2018లో దీని పేరును 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్'గా మార్చారు. ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ అమెరికా యూటర్న్ తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.


# పాట్నా సమీపంలో 15 ఎకరాల్లో శ్రీవారి ఆలయం: టీటీడీ



హైదరాబాద్, జూన్ 17: బీహార్‌లో సరికొత్త శ్రీవారి ఆలయాన్ని నిర్మించనున్నారు. దీని కోసం ఆ రాష్ట్ర సర్కారు భూమిని కేటాయించింది. పాట్నా సమీపంలో సుమారు 15 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు సీఎం సామ్రాట్ చౌదరీ తెలిపారు. ఈ నేపథ్యంలో టీటీడీ చైర్మెన్ బీఆర్ నాయుడు .. ఆ రాష్ట్ర సీఎంను కలిసి సన్మానించారు. సనాతన ధర్మ ప్రచారాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడంలో భాగంగా బీహార్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్. నాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త దొరస్వామితో కలిసి బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిని ఇవాళ మర్యాదపూర్వకంగా కలిశారు. భూమి కేటాయింపుపై ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీహార్ సీఎంను టీటీడీ ఛైర్మన్ శాలువాతో సన్మానించి, శ్రీవారి జ్ఞాపికను బహూకరించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో బీహార్ చీఫ్ సెక్రటరీ శ్రీ అమృత్ ప్రత్యయ్ కూడా పాల్గొన్నారు.

## గంగా నది తీరాన

పాట్నాకు సమీపంలో, గంగా నది తీరానికి దగ్గరగా, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 15 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు. ఇక్కడ స్వామివారి ప్రధాన ఆలయంతో పాటు అత్యంత వైభవంగా కళ్యాణ మండపం, పవిత్రమైన పుష్కరిణిని ఏర్పాటు చేయనున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్. నాయుడు వెల్లడించారు. ఈ ఆలయ నిర్మాణం ద్వారా ఉత్తర భారతదేశ భక్తులకు కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులు మరింత చేరువవుతాయని సీఎం సామ్రాట్ చౌదరి అన్నారు. సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాలను టీటీడీ వేగవంతం చేసిందని, ఇప్పటికే అస్సాం రాష్ట్ర రాజధాని గౌహతిలో ఆలయ నిర్మాణానికి పది ఎకరాల భూమి కేటాయించారని టీటీడీ చైర్మెన్ నాయుడు తెలిపారు. బీహార్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం నిర్మితమైతే, అది హిందూ ధర్మ పరిరక్షణకు, సనాతన సంస్కృతి విస్తరణకు ఒక ప్రముఖ కేంద్రంగా మారుతుందని టీటీడీ ఛైర్మన్ బీఆర్. నాయుడు అభిప్రాయపడ్డారు. భక్తులకు ఉన్నతమైన ఆధ్యాత్మిక సేవలు అందించడానికి, స్థానికంగా ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడానికి ఈ క్షేత్రం ఎంతగానో దోహదపడుతుందని ఆయన వివరించారు.



# స్కాం జరిగిందని ఎలా అంటారు? - మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూన్ 17: తెలంగాణ గురుకుల పాఠశాలల టెండర్లలో రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. సంక్షేమ శాఖల్లో మొత్తం టెండర్ల విలువే రూ.2 వేల కోట్లు లేనప్పుడు, అంత మొత్తంలో స్కాం జరిగిందని ఎలా అంటారు? అని మంత్రి పొన్నం ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న శాఖలపై విమర్శలు చేయడం సరికాదన్నారు.

హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని, వాటిని నిరూపిస్తే ప్రభుత్వం దేనికైనా సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. బలహీన వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, అలాంటి వర్గాలను మాటలతో కించపరచే ప్రయత్నాలు చేయొద్దని హితవు పలికారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే లక్ష్యంతోనే ూఎఖీ ప్రక్రియను తీసుకొచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్ అల్వాల్‌లో విషాదం.

హైదరాబాద్, జూన్ 17: నగరంలోని అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఈఎస్ కాల నీలో ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది.

ఒక అపార్ట్ మెంట్ ముందున్న చెట్టు కొమ్మ లను నరుకుతున్న సమయంలో ఒక దినసరి కూలీ ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కరెంట్ సరఫరా అవుతున్న తీగలు తగలడంతో సూర్యనారాయణ (45) అనే ఆ కూలీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

మృతుడు సూర్యనారాయణ రోజువారీ కూలీ పనులు చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకునేవాడు.

ఆయన మరణంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. సూర్యనారాయణకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇంటిని నడిపించే పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఘటనపై సమాచారం అందుకున్న అల్వాల్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

# ప్రభుత్వ బడులే భవిష్యత్‌కు పునాది

## - సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 17: ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు (బుధవారం) జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యా శాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే టీపీఎస్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. ఆలోచన పోవాలని అన్నారు.

గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగిపోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామన్నారు.

సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే



# జూన్ 30 లోగా బయోమెట్రిక్ పూర్తి చేయకుంటే గ్యాస్ సబ్సిడీ కట్!

న్యూఢిల్లీ, జూన్ 17: వంటగ్యాస్ (ఒఖఉ) వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉజ్వల (జతీతీలిజీశ్రీజీ) పథకం లబ్ధిదారులతో పాటు సబ్సిడీ పొందుతున్న సాధారణ గ్యాస్ వినియోగదారులు కూడా జూన్ 30 లోగా తమ బయోమెట్రిక్ ప్రక్రియను కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ గడువులోగా బయోమెట్రిక్ పూర్తి చేయని వారి ఖాతాల్లో సబ్సిడీ జమ కాకుండా నిలిపివేయనున్నారు. ఏడాదిగా ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ నెల 30లోపు పూర్తి చేయాలని కేంద్రం నిర్దేశించింది..

ఒకవేళ జూన్ 30 గడువు దాటిన తర్వాత బయోమెట్రిక్ పూర్తి చేసుకుంటే.. ఆ తేదీ తర్వాత తీసుకునే సిలిండర్లకు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. గడువు ముగిసిన రోజు నుంచి బయోమెట్రిక్ పూర్తయ్యే మధ్య కాలంలో తీసుకునే సిలిండర్లపై సబ్సిడీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని కేంద్రం తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.

గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా బయోమెట్రిక్ (వేలిముద్రలు/ఐరిస్) అప్‌డేట్ చేయని వారు వెంటనే తమ పరిధిలోని గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. జూన్ 30 లోగా ఈ పని పూర్తి చేసుకుంటేనే ఎలాంటి అంతరాయం లేకుండా సబ్సిడీ డబ్బులు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయి.

గ్యాస్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు ముఖ గుర్తింపు, వేలిముద్రలు లేదా ఐరిస్ వంటి మూడు విధానాలతో ఎల్పీజీ వినియోగదారుల ఈ-కేవైసీని పూర్తి చేయనున్నారు. ఈ ప్రక్రియ కోసం వినియోగదారులే నేరుగా ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చు.

# 'బాస్' పేరిట వాట్సాప్ మోసం.. రూ.10.4 కోట్లకు పైగా బురిడీ




న్యూఢిల్లీ, జూన్ 17:ఓ వాట్సాప్ సందేశాన్ని నమ్మిన సంస్థ ఉద్యోగి చేసిన పొరపాటు ఆ కంపెనీకి రూ.10.4 కోట్లకుపైగా నష్టాన్ని మిగిల్చింది. ఐనాక్స్ గ్రూప్‌నకు చెందిన ఓ ఉన్నతాధికారి పేరుతో గుర్తుతెలియని వ్యక్తి పంపిన సందేశాల ఆధారంగా కంపెనీ ఖాతా నుంచి మొత్తం 63 విడతల్లో భారీ మొత్తాన్ని బదిలీ చేయడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో నలుగురు కేటుగాళ్లను అరెస్ట్ చేశారు పోలీసులు.

ముంబైకి చెందిన ఐనాక్స్ గ్రూప్స్ అకౌంట్స్ విభాగంలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న గిరీశ్ అమీన్‌కు జూన్ 3న ఓ గుర్తుతెలియని నంబర్ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. తాను ఐనాక్స్ గ్రూప్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) సిద్ధార్థ్ జైన్‌నని పరిచయం చేసుకున్నాడు. ఆ నంబర్‌ను తన పర్సనల్ నంబర్‌గా సేవ్ చేసుకోమని, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దన్నాడు. వాట్సాప్ డీపీలోనూ సిద్ధార్థ్ జైన్ ఫొటో ఉండటంతో అమీన్‌కూ ఎలాంటి అనుమానం రాలేదు. ఆ తర్వాత తానో ఎమర్జెన్సీ మీటింగ్‌లో ఉన్నానని చెబుతూ.. వివరాలేమీ అడక్కుండా కొన్ని బ్యాంక్ అకౌంట్స్ నంబర్స్ పంపించి కంపెనీ ఖాతా నుంచి నగదు పంపమని ఆదేశించాడు.

తొలుత రూ.46.5 లక్షల బదిలీతో ప్రారంభమైన ఈ వ్యవహారం జూన్ 3 నుంచి 15 వరకు కొనసాగింది. ఇలా మొత్తం 63 ట్రాన్సాక్షన్స్ ద్వారా మొత్తం రూ.10,40,71,924 నగదు పలు ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ అయింది. ఆ తర్వాత సదరు చెల్లింపులకు సంబంధించిన ఇన్‌వాయిస్‌లు కావాలని అధికారికంగా సిద్ధార్థ్ జైన్‌ను సంప్రదించాడు అమీన్. తానెలాంటి ఆదేశాలివ్వలేదని సిద్ధార్థ్ చెప్పడంతో అసలు విషయం బయటపడింది. దీంతో అమీన్ పోలీసులను ఆశ్రయించాడు.

దర్యాప్తు చేపట్టిన ముంబై పోలీసులు.. ఢిల్లీలోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ జసోలా బ్రాంచ్ నుంచి కీలక సమాచారం అందుకున్నారు. అనుమానాస్పదంగా రూ.8 లక్షలు నగదు విత్‌డ్రా చేసుకునేందుకు వచ్చిన వికాస్, వంశ్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ఇరువురి బ్యాంకు అకౌంట్లను మోసపూరిత లావాదేవీలు జరిపేందుకు కమీషన్ కోసం ఇచ్చినట్లు విచారణలో తేలింది. దీంతో ఫయ్యాజ్ ఆలమ్, అమిత్ అనే మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు పోలీసులు. అయితే.. ఈ మోసం వెనుకున్న అసలు సూత్రధారులు ఎవరనేది ఇంకా తెలియరాలేదు.

నేటినిజం
# సాహితీ కెరటాలు
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 18-6-2026

## సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త: సుధామ



కాలము
గాలము.
జీవితములో
జరిగే సంఘటనలు
మనము
తెలియజాలము,
-విజయకుమారి
ముదిగొండ

విధానం
అవధానం
శరీరానికి
శిరస్సు,
వేదాలకు ఉపనిషత్తు
ప్రధానం.
-కె. ఎం. కె. మూర్తి
సికింద్రాబాద్

అదరకండి
బెదరకండి
ఎంత
భయపెట్టినా
చేయాల్సిన పనిని
వదలకండి
-పంతుల లలిత
విశాఖపట్నం..

పెరుగు
తరుగు
కంసాలి
బంగారాల వ్యాపారం
వీటితోనే
జరుగు.
-రాజప్ప
రాజమహేంద్రవరం

నేరము
ఘోరము
సత్ప్రవర్తన
లోపిస్తే
మనిషికి సద్భావన
దూరము!
-గోపరాజు వెంకట
సూర్యనారాయణ

ప్రారంభం
సంరంభం
చదువుల
గుడిలో
అయ్యవార్ల
ఆవేదన
పునఃప్రారంభం
-సొట్టుభవానీదేవి
వింజమూరు

# ఇదంతా.. గాంధీజీ గ్రావిటీ..!

"He impressed me deeply by his sincerity"-Charlie Chaplin

"He is a Hero, not just to India, but to the world"-Barack Obama

గాంధీజీ మానవతావాది అంటూ..ఆయన అనుసరించిన 'అహింసా మార్గం' యొక్క శక్తిని, ఆయన ప్రజా పోరాట పటిమను చే గువేరా, ఫీడల్ క్యాస్ట్రో వంటి విప్లవకారులు కూడా స్ఫూర్తిగా తీసుకున్నారు.

గాంధీజీ భౌతికంగా అస్తమించి దాదాపు ఎనిమిది దశాబ్దాలు కావస్తోంది. అయినప్పటికీ... ప్రతిరోజూ ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులకు సంబంధించిన ఎన్నో సమస్యల పరిష్కారంలో గాంధీయవాదమే వినిపిస్తోంది. గాంధీ పుట్టిన దేశమంటూ యావత్ ప్రపంచం మన భూభాగాన్ని గుర్తిస్తుందంటే.. గాంధీ అనే 'జీవిత సత్యం' సృష్టించిన స్ఫూర్తి ప్రభంజనం ఏ పాటిదో మనం గుర్తించవచ్చు. న్యూటన్ ఫిజిక్స్ గ్రావిటీ మాదిరి గాంధీజీ జీవన గ్రావిటీ విశ్వవ్యాప్తం. ప్రపంచవ్యాప్తంగా లక్షల సంఖ్యలో కవులు, రచయితలు గాంధీ గురించి రాస్తూనే ఉన్నారు. కళాకారులు ఎన్నో రూపాల్లో గాంధీజీని సమాజ తెరపై ఆవిష్కరిస్తూనే ఉన్నారు. జీసస్, బుద్ధుడు, ప్రవక్త, రాముడు, కృష్ణుడు ఇలాంటి చారిత్రాత్మక వ్యక్తులతో గాంధీజీని పోలుస్తూనే ఉన్నారు.


ఎంతటి శత్రువు ఎదురైనా, శారీరక హింస, మరణం తప్పదని తెలిసినా, ఓర్పు కోల్పోకుండా సహనంతో, చిరునవ్వుతో చేసే క్షమతో కూడిన పోరాటమే సత్యాగ్రహం! ఈ సమాజం సమూలంగా మారాలన్న విప్లవవాది, అయితే దానికి ఎన్నుకోవాల్సిన విధానం కూడా ఉత్కృష్టంగా, అహింసాయుతంగా ఉండాలని ప్రతిపాదించిన సిద్ధాంతకర్త గాంధీజీ ! అంటూ "అసలైన విప్లవాదీ... సిసలైన సిద్ధాంతకర్త గాంధీజీ" అనే కోణంలో అద్భుతమైన ఆలోచనా తరంగాలను అక్షరాలుగా మార్చి.. అనంత విశ్వంలో విశ్లేషించారు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్.

జిజ్ఞాస, వివేకం, మేధ , పరిశీలనా శక్తి, దార్శనికత, క్షమ, సహిష్ణుత, ప్రేమ, పట్టుదల గల వ్యక్తి గాంధీజీ. తాత్విక ఆలోచనలు గల హేతుబద్ధమైన వాస్తవికవాది! వేషం, భాష కడు సాత్వికం కానీ ప్రపంచం సమూలంగా మారాలని విప్లవవాది! సైన్స్, వైద్యం, పర్యావరణం, రాజకీయాలు, నైతిక జీవనం, మతాల సఖ్యత, విలువలు ఇలా చాలా విషయాల గురించి గాంధీజీ మాట్లాడిన.. పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక అభిప్రాయాలను 34 వ్యాసాలు గా కలిపి పుస్తకంగా మన ముందుకు తీసుకొచ్చారు రచయిత. కొల్లాయి కట్టింది ఎందుకు?, సేవ అంటే ఇప్పటి సర్వీస్ కాదు!, శత్రువుని సైతం సంస్కరించే సత్యాగ్రహం, అంతరంగం నుంచి అంతర్జాతీయం దాకా..., కరుణ టైంలో గాంధీజీ ఉండి ఉంటే..., గాంధీజీ సార్వత్రికత ఏమిటి?, సైన్స్ ఆఫ్ బ్రహ్మచర్య, గాంధీ పథం ఏమైంది?, ప్రపంచవ్యాప్తంగా ఆకర్షిస్తున్న గాంధీజీ స్వీయ చరిత్ర, గ్లోబల్ రోల్ మోడల్ గా గాంధీజీ!, గాంధీజీ దృష్టిలో టెక్నాలజి వంటి వినూత్న శీర్షికలతో రాసిన వ్యాసాలు నేటి తరంతో పాటు.. భవిష్యత్ తరాలకు కూడా గాంధీయిజం నకు వారధిగా పనిచేస్తాయి.

మెడికల్ డిగ్రీ సంపాదించి పూర్తిస్థాయి వైద్యుడుగా స్థిరపడాలనుకున్న గాంధీజీ... 200 సంవత్సరాల కు పైగా పాలించిన బ్రిటిష్ వాళ్ళను మన దేశం నుంచి తరిమేయడానికి ఎన్నో 'అహింస శస్త్ర చికిత్సలు' చేశారు. ఆయన అనుసరించిన జీవన విధానాలు, బోధించిన అనుసరణీయ మార్గాలన్నీ.. ప్రాంతాతీతం, కాలాతీతమని చెప్పవచ్చు. "వాస్తవంగా గడిచిన నూరేళ్లలో భారతదేశంలో ఏ సంఘసంస్కర్తా భారత స్త్రీల విముక్తికి గాంధీ చేసినంత సఫల కృషి చేయలేదంటారు బి.కే. అహ్లూవాలియా. అహింస అనేది మన జీవన సూత్రమయితే భవిష్యత్తంతా మహిళలదే అన్న గాంధీజీ దూర దృష్టిని అహ్లూవాలియా తన పుస్తకంలో పేర్కొన్న విధానాన్ని రచయిత పాఠకులకు గుర్తు చేశారు.

ఈ పుస్తకంలోని అన్ని వ్యాసాల్లో వేణుగోపాల్ గారు ప్రపంచ ప్రముఖులు, రచయితలు వివిధ సందర్భాల్లో గాంధీజీ గురించి చేసిన వ్యాఖ్యలను శాస్త్రీయంగా వివరిస్తూనే విశ్లేషించారు. వాటికి సంబంధించిన శాస్త్రీయ ఆధారాలను తేదీలతో సహా అందించారు. 61 ఏళ్ల వయసులో 200 మైళ్ల దండి సత్యాగ్రహంలో ఏమి నడుస్తారని బ్రిటిష్ ప్రభుత్వం భావించి వెల్లకిలా పడింది. చివరిదాకా రోజుకు 18 గంటలు కష్టపడటమే కాదు, ఏక కాలంలో పలు కార్యాలు సఫలంగా నిర్వహించిన మల్టీటాస్కింగ్ మనీషి గాంధీజీ.

"...వ్యక్తుల ద్వారా గౌతమ బుద్ధుడు, ఏసుక్రీస్తు అహింసా సిద్ధాంతాన్ని ప్రయోగిస్తే, సంఘం ద్వారా గాంధీ ప్రయోగించారు" అని ఏడు దశాబ్దాల క్రితమే నార్ల వెంకటేశ్వరరావు విశ్లేషణను, గాంధీజీ ప్రయోగాలు.. విశ్వవిఖ్యాత మనస్తత్వ శాస్త్రవేత్త సిగ్మాండ్ ఫ్రాయిడ్ స్థాయివని ఆయన శిష్యుడు ఎరిక్ సన్ 'గాంధీస్ ట్రూత్' అనే పుస్తకంలో రాసిన అభిప్రాయాన్ని సైతం .. ఓ వ్యాసంలో గుర్తు చేశారు.







ప్రతులకు:
డా॥ నాగసూరి వేణుగోపాల్
సెల్:94407 32392

ప్రసిద్ధ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి గాంధీకిచ్చిన అక్షర నివాళి మనకు గుర్తు చేశారు.

"ఈయన మన కళ్ళు మిరుమిట్లు గొలుపడు. ఈయన కైలాస శిఖరం కాదు. దేశం అంత జలాశయం గాంధీ.గాంధీ గంగానది... దానిలో అమృతం మీకూ, నాకూ అందరికీ అహరహమూ అన్ని పనులకూ అందుబాటులో ఉంటుంది...". త్రిపురనేని గోపీచంద్, దేవరకొండ బాలగంగాధర్ తిలక్, కొడవటిగంటి కుటుంబరావు, దాశరథి కృష్ణమాచార్య, మహాకవి శ్రీశ్రీ వంటి వారు సైతం గాంధీని కీర్తించిన విధానాన్ని రచయిత ఓ వ్యాసంలో పేర్కొన్నారు. మతాల మధ్య ఘర్షణ నివారణకు, నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు గాంధీజీ. మెజార్టీ మతస్తులు సహిష్ణుతలో ఉండాలని పదేపదే చెప్పారు. అయితే చివరకు మతపరమైన ధోరణి మాత్రమే గాంధీజీని హత్య చేసిందంటూ తన భావోద్వేగమైన ఆవేదనను రచయిత ఓ సందర్భంలో ప్రస్తావించారు.

"........అహింసా మార్గోపదేష్టగా శాంతి ప్రవక్తగా, సత్యాన్వేషణా పరతంత్ర శీలిగా నిలిచి జాతిని నిలబెట్టాడు. తను వెలిగి జాతిని వెలిగించాడు గాంధీ! అన్న ఆవంత్స సోమ సుందర్ స్ఫూర్తి వాక్యాలు మనకు ఈ పుస్తకంలో దేదీప్యమానంగా వెలుగుతూనే ఉన్నాయి. విఖ్యాత కవి జాన్ రస్కిన్ రాసిన 'అన్ టు ది లాస్ట్' పుస్తకాన్ని గాంధీజీ రైల్లో చదివి.. చెప్పిన సర్వోదయ సిద్ధాంతాలు కూడా ఈ పుస్తకంలో రచయిత గుర్తు చేశారు.

1. ఒక వ్యక్తి హితం సర్వజనుల హితంలో ఇమిడి ఉంది.

2. వకీల్ పనికి ఎంత విలువ ఉందో క్షురకుడి పనికి కూడా అంతే విలువ ఉంది. ఎందుకంటే జీవనోపాధి హక్కు అందరికీ సమానమే. 3. శ్రమజీవనం అంటే భూమిని దున్నే వాడి జీవితం, చేతులతో పని చేసే వారి జీవితం శ్రేష్ఠమైన జీవితం.

"మనిషి కేవలం మేధస్సుతోనే కాకుండా ప్రతినిత్యం శారీరక కష్టం చేయాలని తన జీవితకాలంలో 27 రకాల పనులను కడునైపుణ్యంతో సాధించిన ఆధునిక వాది. కొత్త మతాన్ని ప్రతిపాదించలేదు కానీ భారతదేశంలో ప్రజలు పాటించే అన్ని మతాలనూ, విశ్వాసాలను గమనించి వాటిలోని మానవీయ విలువలను ప్రోది చేసి అందించిన దార్శనికుడు ఆయన.సత్యాగ్రహమంటే సత్యమూ, ఆగ్రహమూ కానే కాదు సత్యాన్ని గ్రహించడమే సత్యాగ్రహం. దాన్ని పాటించిన వ్యక్తి సత్యాగ్రహి"వంటి గాంధీ జీవితానికి సంబంధించిన రచయిత పరిశోధనా వాక్యాలు పుస్తక మంతట చాలా సందర్భాల్లో మనకు దర్శనమిస్తాయి.

'మిమ్మల్ని ఒకరోజు పాటు భారతదేశానికి వైస్రాయిని చేస్తే ఏం చేస్తారు? అని ఒక విదేశీయుడు అడిగితే 'వైస్రాయ్ భవనంలో ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతూ అపరిశుభ్రంగా ఉన్న పారిశుద్ధ్య పనివారి నివాసాలను శుభ్రం చేస్తాను' అని జవాబు. మీ పదవీ కాలాన్ని మరో రోజు పొడిగిస్తే?' అని ప్రశ్న కొనసాగితే 'మర్నాడు కూడా నేను అదే పని చేస్తాను' అనే మాటలు ఎదురయ్యాయి" అంటూ శ్రమజీవిగా బహు రూపి అనే వ్యాసంలో గాంధీజీ పలు సందర్భాల్లో శ్రమ జీవన సౌందర్యాన్ని గౌరవించిన తీరు నేటి సమాజంలో పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజేస్తాయి.

కరోనా టైంలో గాంధీజీ ఉండి ఉంటే... భయం నుండి విముక్తి; రోగులను జాగ్రత్త కనిపెట్టి ఉండేవారు; నూతన దండి సత్యాగ్రహం; పరస్పర విశ్వాసం, సమిష్టి ఐక్యత; నా పరిసరాలు, నా బాధ్యత; గ్రామ స్వరాజ్యం; అహం కారం తగ్గించుకునేందుకు ప్రార్థన అంటూ కొత్త ఆలోచనను పాఠకుల హృదయాల్లో ముద్రించారు రచయిత.

ఈ 75 ఏళ్ల స్వాతంత్ర్య దేశపు రీతులను 'గాంధీజీ ఆచరణ' అనే నిలువుటద్దంలో సులువుగా తెలుసుకోవచ్చు. తెలుసుకుంటామా? లేదా? అనేది మన ఇష్టం. అయితే, అదే దేశ భవిష్యత్తును నిర్ణయించే కొలబద్ద! అంటూ పుస్తకంలో చివరివ్యాసాన్ని ముగించారు రచయిత. పుస్తకంలో అనుబంధంగా "గాంధీజీ జీవన గమనం" అంటూ ఆయన జీవితంలోని ప్రధాన ఘట్టాల తేదీలను పేర్కొన్నారు.

ఈ పుస్తకంలోని వ్యాసాలను చదువుతుంటే రచయిత కొన్ని దశాబ్దాలుగా గాంధీజీ ని.. విశ్వవ్యాప్తంగా దర్శించిన తీరు, వారి శ్రమ.. మనకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. ఏదేమైనా... ఒక్కటి మాత్రం నిజం! గాంధీజీని సమగ్రంగా ప్రపంచం గమనించి.. ఆయన జీవన విధానాన్ని ఆచరిస్తుంటే...

మనదేశంలో మాత్రం గాంధీజీని సంకుచితంగా ఆలోచిస్తున్నాం! ఈ ధోరణి మారాలనీ.. మనమంతా గాంధీయవాద మార్గంలోనే పయనించాలనీ... అది తప్ప ప్రపంచానికి వేరే మార్గమే లేదనే రచయిత ప్రగాఢ విశ్వాసాన్ని మనమంతా మనస్ఫూర్తిగా గౌరవిస్తూ స్వాగతిద్దాం.


"I am sure that this book will be an important element in the discourse about Mahatma Gandhi. There is a great need to understand Gandhi as being relevant not just for India but also for the world itself. we need more of such works to be published and disseminated widely." Gandhi -A Relook అంటూ ఈ పుస్తకానికి ముందుమాట రాసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి గారి అక్షరాలతో ఏకీభవిస్తూ...

సత్యమేవ జయతే
సత్యానికి చావు లేదు సత్యాన్ని చంపలేరు



-ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

పుస్తక సమీక్షలు





ప్రతులకు:
శ్రీమతి పి. ఉషారాణి
ఇ.నెం.104-6-140, మహాత్మాగాంధీ స్ట్రీట్, రామకృష్ణానగర్,
రాజమహేంద్రవరం-533101.

## ఆరుద్ర సప్తతి ఉత్సవం

పదము పదమున తేనెలూరగ పాట చందము మనసు మెచ్చగ కవితయందున కాంతి నింపిన రుద్రడితడే! ఆరుద్ర! అంటూ కవులు ప్రశంసల వర్షం కురిపించిన శుభవేల. ఆగష్టు 31వ తేదీ 1994వ సంవత్సరంలో రాజమహేంద్రిలో ఆరుద్రగారి 70వ జన్మదినోత్సవం ఘనంగా వేడుకగా సాహితీవేత్తలూ, ఆయన అభిమానులూ కలిసి నిర్వహించారు. ఆ ఉత్సవానికి ముందుండి నడిపించిన వారు ఎస్.ఆర్. పృథ్వి. వారు ఈ ఉత్సవాలకు ప్రేరణ, సారధ్య సంఘం, ప్రణాళిక, నిర్వహణ, ఆర్థిక వనరులు, ఇలా ఎన్నో విషయాలను విపులంగా చర్చించారు.

ఆరుద్రగారు మూడక్షరాల మహావ్యక్తి. సమ సమాజాన్ని అభిలషించే శక్తి. అంతే కాదు, ఆయనొక సాహిత్య సంస్థ. ప్రాచీన సాహిత్యాన్ని మదించిన పండితుడు, ఆధునిక సాహిత్యాన్ని సుసంపన్నం చేసి, తన ప్రత్యేక 'ముద్ర ఇదీ' అని కవిత్వం ద్వారా చూపిన స్రష్ట. ఇక సినిమా గీతాల ద్వారా సాహిత్య విలువలను పెంచి, విలువ కట్టలేని పాటలు వ్రాసిన ప్రజాకవి. 'త్వమేవా హమ్' వంటి అత్యాధునిక కవిత్వాన్ని అందించిన ప్రయోగదక్షుడు. ఎవరు ఏ కోణంలో ఆరుద్రను చూస్తె ఆ కోణంలో ఆరుద్ర వారికి దర్శనమివ్వడం సహజం. పృథ్వీగారు 48 పేజీల్లో పలు విషయాలను విపులంగా చర్చించారు. ఒక విధంగా ఈ పుస్తకం ఒక నివేదికలాగా వుంది. అన్నీ వివరంగా అదించారు పృథ్వీ.



- డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

## కథాలహరి

"తుఫాను అంతటి ప్రభంజనాన్ని ఒకటి కప్పులో ఇమడ్చ గలిగేదే సాహిత్యం" అంటారు ప్రముఖ కథా, వ్యాస రచయిత్రి మరియు పర్యావరణ రక్షణ ఉద్యమకర్త శ్రీమతి అరుంధతీ రాయ్. 94 పేజీల మేర 7 కథలు వ్రాసి అందిస్తోన్న రచయిత్రి లహరి మహేందర్ గౌడ్ వ్రాసిన **"లహరీయం"** కథా సంపుటి చదువుతోంటే- ఒక బాధ్యత గల ఏ.సీ.బి ఆఫీసర్ గృహస్త జీవితం. రక్తంతో పాటు ఎముకలు కూడా గడ్డ కట్టించే చలిలో అడవిలో అర్ధరాత్రి బైకు ఫెయిల్యూర్ వల్ల ఇరుక్కుపోయిన రితేష్, పెళ్ళయిన ప్రతి కొత్త జంట ఏకాంతం కోరుకుంటుంది. ఎన్నో 'స్వీట్ నథింగ్స్' షేర్ చేసుకోవాలని ఉబలాటపడు తుంది. ప్రతి సంఘటనకు ఏదో ఓ అనుకోని చుక్కెదురు.

ఎప్పుడూ ఐదు, ఆరు గంటల సాయంత్రంలోపే వచ్చే మల్లేష్ అన్న సాయంత్రం ఎనిమిది గంటలయినా రాక పోతే చెల్లెలు గౌరి పడే ఆందోళన. పని చేస్తోన్న రైస్‌మిల్ దగ్గర లేక ఊరంతా వెదికినా ఎక్కడా కనబడకపోతే తలిదండ్రులు ప్రత్యేకించి అన్నతో అనుబంధం పెంచుకున్న చెల్లెలు. చివరకు మూఢ నమ్మకాలకు దగ్గరి వారే బలి చేసారన్న విషయం తెలిసి చెల్లెలు గౌరి పడిన వేదన-


అందరు రచయితలు రచయిత్రులు రాయగలరేమో.. కాని నోట్లో ఇంకా పళ్ళు రాని బోసి నవ్వుల పాపాయి 'బుజ్జిగాడు" అంతరంగాన్ని (ఇన్నర్ వాయిస్) ఊహించి చెబుతోంటే- 'ఓరి! నీ.. బుజ్జి వెధవా! వేలెడంత లేవు.. నీ పొట్టలో ఇన్ని ఆలోచనలా- అని ఆశ్చర్యపడేలా వాడి అంతరంగపుటాలోచనల ఆవిష్కరణ.

కరోనా లాక్‌డౌన్ సమయాన వలసవచ్చిన కూలీలు తమ సొంతూళ్ళకు చేరాలన్న ఆరాటం ఎదుర్కొనే కష్టాల ప్రయాణం-

వీటన్నింటినీ, రచయిత్రి లహరి మహేందర్ గౌడ్ ఏకరువు పెడుతు ఈ ఇందూరు 'ఇంతి' మొదటి అడుగు సాహిత్యంలో చింత చిగురు కవితా సంపుటితో వేసారని.. ఆ 'అడుగు'కు వచ్చిన ప్రోత్సాహమే ఆమెతో మలి అడుగుగా ఈ కథా సంపుటి ఆవిర్భవించిందని తెలుస్తోంది.

కథల ఇతివృత్తము ఎన్నికే కాదు, కథలకు ఇచ్చే శీర్షికల్లో కూడా రచయిత్రి నవ్యతను చూపుతున్నారు. **'తరాలు మారినా మారని తలరాతలు'.. నిరీక్షణ ఫలితం ఇలా ఉండొద్దు. నీ చూపులే నా ఊపిరి..ష్?. ఇంతకు ఏం జరిగిందంటే, ప్రేమ ఆకర్షణ మధ్యలో నేను..**లాంటి శీర్షికలు పాఠకుడు పుస్తకం చేతిలోకి తీసుకోగానే 'ఉత్సుకత' కలిగిస్తాయి. కథనమే కాదు...ఎత్తుగడ కూడా ప్రత్యేకమే.. అది ఒక ప్రఖ్యాత ఇంజనీరింగ్ కాలేజి.. నిజానికి ఇలాంటి ఈవెంట్స్ కండెక్టు చేయటం ఆమెకు (అనూషకు) ఏ మాత్రం ఇష్టం లేదు (ప్రేమ ఆకర్షణ మధ్యలో నేను-కథ) మమ్మీ, డాడీ ఇంకా ఎప్పుడు వస్తాడు.. నాకు బోరుకొడుతుంది (అలసిన వలసలు) గౌరీ సాయంత్రం నుండి మాటి మాటికీ గేటువైపు చూస్తూ -(ష్.. ఇంతకి ఏం జరిగిందంటే) లాంటి ఎత్తుగడలు.. పాఠకుడిని ఆదిలోనే ఆకట్టుకుంటాయి.

రచయిత్రి కథల్లో మరో ప్రత్యేకత.. సంక్లిప్తత.. సాగదీతలు.. అనవసర వర్ణనలు లేక పోవటం.. ఇందువల్ల పాఠకులు కథతో డైరెక్టుగా కనెక్టు అవుతారు. మొదటి కథా సంపుటే.... అయినా.. ఆమె తన 'మనసులో మాట' లో చెప్పుకున్నట్లు తొలి అధ్యక్షులు జానపద అకాడమీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న శ్రీ పోట్లూరి హరికృష్ణ గారి సలహా, ప్రోత్సాహాన్ని పాటిస్తున్నందువల్ల మంచి కథలుగా వచ్చాయి అంటున్నారు రచయిత్రి. హరి కృష్ణగారికి మరియు రచయిత్రికి అభినందనలు.





ప్రతులకు:
లహరి
మహేందర్ గౌడ్,
సెల్:9908123209

రచయిత్రి, కవయిత్రి శ్రీమతి వడ్లమాని మణి గారాశించినట్లు వీరి సాహిత్య ప్రస్థానం మరింత వేగంగా, ఎక్కువగా, సాగాలని కోరుకుందాం.

-కూర చిదంబరం
సెల్: 8639338675



# అన్ని అద్దాలు-అబద్ధాలు ఒకటి కావు!





ఇది సినిమా ప్రకటన కాదండోయ్. ఆ మధ్య ఓ సినిమా వచ్చింది. దాని ట్యాగ్ లైన్ అన్ని సినిమాలూ ఒకేలా వుండవు అని. ఆ ఒక్క లైన్ సినిమా మీద విపరీతంగా ఆసక్తిని పెంచింది. కథకు, నవలకు, సినిమాకు ఆ మాటకొస్తే జనం ముందుకు వచ్చే ఏదైనా సరే ప్రేక్షకుల్లో, పాఠకుల్లో, జనంలో ఆసక్తిని పెంచాలి. మనం మామూలుగా ఏదో పని చేసుకుంటుంటాం. సడన్‌గా పెద్ద శబ్దం వినిపిస్తుంది. అప్పుడు తలతిప్పి చూస్తాం కదా!

ఇప్పుడు విషయంలోకి వెళ్దాం. ఈరోజు మా మెంటార్, మిస్టర్ క్లీన్‌తో అవసరం పడింది. 'అద్దం అబద్ధం చెప్పదు' అంటారు కదా! అందులో నిజం ఎంత అని మా సారుని అడిగాం. ఆయన తక్షణమే రియాక్ట్ కాలేదు. కళ్ళు మూసుకున్నారు. అన్య కేసి చూశాను.

"మూలాల్లోకి వెళ్తున్నారనుకుంటా" అని నా చెవి దగ్గర గుసగుసగా చెప్పింది.

మా సారు కళ్ళు తెరిచారు.

"నీ ప్రశ్నలో రెండు విషయాలున్నాయిరా మేంగో. ఒకటి అద్దం. రెండోది అబద్ధం. దేని గురించి చెప్పమంటావు" అన్నారు.

"అడగటం మా వంతు. చెప్పటం మీ ధర్మం" అన్నాను.

"నిన్ను కూడా నేను పూనినట్లుంది. వృక్షాలను కాపాడితే అవి మిమ్మల్ని కాపాడతాయి. ధర్మాన్ని మీరు కాపాడితే ధర్మం మిమ్మల్ని రక్షిస్తుంది. ఇలాంటివి చాలా వున్నాయి. ఇంతకూ మీరు అద్దాల మీద పడ్డారేంటి" అని చిన్నగా నవ్వారు.

ఎవ్వరం మాట్లాడలేదు.

"సరే. అద్దాలు నిజమే చెబుతాయి అని ఎవరన్నా అన్నారా? మనకు తెలియదు. కొండ అద్దమందు చిన్నగా కనిపిస్తుంది. అంటే కొండ చిన్నదా? అద్దం అంత పెద్దదా. అసలు ఇలాంటి సామెతలు ఎందుకు చెబుతారు. మనసుని అద్దంలా వుంచుకోండి అనేకదా. ఇప్పుడు నా కామెంట్ 'అద్దాలన్నీ ఒకటి కాదు' అని మమ్మల్ని చూశారు.

"అవును. ఎగ్జిబిషన్‌కి వెళ్తే రకరకాల అద్దాలుంటాయి. అందులో మనుషులు చిత్ర విచిత్రంగా కనిపిస్తారు. అది అబద్ధమే కదా!" అన్నాడు విదూ. అప్పుడు సారు తలూపారు.

"ఇక్కడ మేకింగ్ ముఖ్యం. ఎవరు ఎలాంటి అద్దాలు తయారు చేస్తున్నారు. అందులో నువ్వు దేవతలా కనిపిస్తున్నావా? దెయ్యంలా కనిపిస్తున్నావా? కామెడీగా కనిపిస్తున్నావా? వాంతి వచ్చేలా దర్శనం ఇస్తున్నావా? ఇందులో ఏది నిజం, ఏది అబ ద్ధం అంటే నీకు నచ్చిందే నువ్వు అంగీకరిస్తావు కదా. అంటే అద్దాన్ని అబద్ధంతో నిజంతో లింక్ చేశారు కాబట్టి మనం దాని గురించి మాట్లాడుకుందాం" అన్నారు. తర్వాత?

"అద్దాలు అబద్దాలు చెబుతాయి. నిజాలు చెబుతాయి. అవన్నీ రకరకాలుగా వుంటాయి. సగం సగంగా వుంటాయి. అసలు ఇంకోటి చెబుతాను. నీరు పల్లమెరుగు-నిజం దేవుడెరుగు అంటారు. ఇదీ పలాయనవాదమే" అన్నారు.

"మీరు టాపిక్‌ని డైవర్ట్ చేస్తున్నారు. విషయానికి పరిమితం అయితే బాగుంటుంది" అంది అన్య.

"అమ్మాయి. డైవర్ట్ చేయటానికి నేను పొలిటిషియన్నా! నేనేం మాట్లాడినా లింక్ వుంటుంది. నీరు పల్లంలోకి వెళ్తుంది. నిజమే. మోటార్లు వచ్చాక అవి కొండ మీద టాంకుల్లోకి కూడా వెళ్తాయి. నిజం దేవుడెరుగు అన్నారు. అసలు ఆయన వున్నాడా లేదా అనేది పక్కనుంచుదాం. ఓ ప్రమాదం జరిగింది. ఓ మర్డర్ జరిగింది. ఇంకోటి జరిగింది. అది ఎవరు చేశారో, తప్పు ఎవరిదో తేలలేదు. తేల్చలేదు. కానీ అది చేసినవారికి తెలుసు కదా. అంటే వాళ్ళని దేవుడు అంటున్నారా?"

"మధ్యలో మేం కల్పించుకోం. మీరు ఫినిష్ చెయ్యండి" అన్నాను.

"ఈ సామెతలన్నీ ఆయా సందర్భాల్లో చెబుతుంటారు. అంటే అవి అంతవరకే. అవి దాటి చూస్తే వాటికి విలువ వుండదు. ఎందుకంటే లోకంలో మేధావులు వుంటారు. తర్కం తెలిసిన వారుంటారు. రంధ్రాన్వేషకులు వుంటారు. వారు భూతద్దాలు వేసుకుని వెతుకుతుంటారు" అని?

"డైవర్ట్ అవుతున్నాను అనుకోవద్దు. చిన్న జోకు చెబుతాను. ఓ రచయితకు దెయ్యాలు, భూతాలు అంటే ఇష్టం వుండదు. అవన్నీ అభూత కల్పనలు అంటాడు. అలాంటి కథలూ, నవలలు రాయడు. అతను ఓ పుస్తకం రాసుకుని పబ్లిషర్ దగ్గరకు వెళ్ళాడు. ఈరోజుల్లో ఇలాంటి పుస్తకాలు ఎవరూ కొనరు. దెయ్యాలకూ, భూతాలకూ మంచి గిరాకి వుంది. అలాంటిదేదన్నా రాసుకురండి ప్రచురిద్దాం అన్నాడంట. దానిమీద మన రచయితకు కోపం వచ్చి కాసేపు గట్టిగా వాదించాడు. మీరు ప్రచురించకపోయినా ఫర్వాలేదు. నేను ఇలాంటివే రాస్తాను అన్నాడంట. పబ్లిషర్ గారు మంచిదని చెప్పి అతని పుస్తకం తెరిచి ఇదేంటి అన్నాడంట. అతను చూస్తే అందులో 'భూతద్దం' అనే పదం వుంది. దీని సంగతేంటి అన్నీ అద్దాలే కదా. అద్దాల్లో భూతాలుంటాయా అన్నాడు. మన రచయిత గారు బిక్కముఖం వేశాడంట. నాయనా కొన్ని పదాలు మన బతుకులో, సాహిత్యంలో స్థిరపడిపోయాయి. అవున్నాయో లేవో భూతాలకెరుక. వ్యాపారం మాత్రమే నిజం. నువ్వు తెలివిగలవాడివి అయితే అవి లేవని కూడా రాయవచ్చు. లేదా పాఠకులకు వదిలేయవచ్చు అని గీతోపదేశం చేశాడంట" అనగానే అందరం నవ్వాం."కాబట్టి ఇప్పుడు మనుషుల్లో చాలామందికి నీతి, నిజాయితీ లేదు. వారికి సత్యం, నిజం లాంటివి అవసరం లేదు. అయినా కొన్ని సందర్భాలు చెప్పి అలాంటప్పుడు అబద్ధం ఆడినా తప్పు లేదంటారు. అలాగే ఓ పెళ్ళి జరగాలంటే వెయ్యి అబద్ధాలు ఆడినా ఫర్వాలేదు అంటారు. అది ఆడపిల్లల విషయంలోనే కాదు. మగ పిల్లల విషయంలో కూడా అన్యా" అన్నారు.అన్య సైలెంట్‌గా వుంది."అందువల్ల ఇప్పుడు అబద్ధాల పునాదుల మీద రాజకీయాలు వున్నాయి. నిజం అనేది కొండను అద్దంలో చూపించటం లాంటిది. సో? ఇప్పుడు ఏది నిజం, ఏది అబద్ధం. ఎంతవరకు అనేది చర్చలకు పరిమితం. అందుకని మీరు హాయిగా మీకు సంతోషం కలిగించే పనులు మాత్రం చేయండి. ఇంత చిన్న వయసులో ఇలాంటివాటి జోలికి వెళ్తే మీరు ఆనందాలు కోల్పోతారు" అని ముక్తాయించారు.



- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

# ముళ్లతోట నుండి ఎదిగిన గులాబీ డా॥ ఏనుగు నరసింహారెడ్డి



జీవితం అందరికీ పరిచిన పూల పాన్పు కాదు. అన్నీ అనుకూలంగా ఉన్నవారు ఒక స్థాయికి చేరడంలో వింతేమీ లేదు. చుట్టూ సమస్యల చిక్కుముళ్లే ఉండి వాటి మధ్య నుండి ఎదగడం సాధ్యమయ్యే పని కాదని అనుకుంటాం. ఎంతో ఆత్మ విశ్వాసం, నిరంతర కృషితో అలా ఎదిగి వచ్చినవారు చుట్టూ ఉన్న ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తారు. అలాంటి ఆదర్శమూర్తి ప్రముఖ సాహితీవేత్త, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నరసింహారెడ్డి. బాల్యంలోనే తండ్రిని కోల్పోయి, అనేక ఇబ్బందులు ఎదుర్కొని ఐ.ఏ.ఎస్. హోదా పొందేదాకా ఆయన ప్రయాణం స్ఫూర్తిదాయకం.

బాల్యంలో డా.నరసింహారెడ్డి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. ఆ ముళ్లతోట నుండే గులాబీగా ఎదిగారు.

ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కల్లోనికుంట గ్రామంలో 1968 ఏప్రిల్ 6 వ తేదీన ఏనుగు కృష్ణారెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు ఆయన జన్మించారు. పుట్టిన మూడేళ్ళకు తండ్రి కృష్ణారెడ్డి చనిపోయారు. నరసింహారెడ్డిని తీసుకొని తల్లి లక్ష్మమ్మ హైదరాబాదు మహానగరాన్ని ఆశ్రయించింది. అక్కడా ఇబ్బందులు ఎదురుకావడంతో చిట్యాలలో స్థిరపడింది. అక్కడే నరసింహారెడ్డి పదో తరగతి వరకు చదువుకున్నారు. రామన్నపేటలో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. సికింద్రాబాద్, నల్గొండల్లో డిగ్రీ చదివారు. ఆ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్నాతకోత్తర విద్యాభ్యాసం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్., పిహెచ్.డి. పట్టాలు పొందారు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారి పురాణ ప్రబోధ పరీక్షలో ఇంటర్మీడియట్ స్థాయిలోనే జిల్లా మొదటి ర్యాంకు పొంది, రజత పతకం స్వీకరించారు.

నరసింహారెడ్డి సాహిత్య ప్రస్థానానికి పాఠశాల స్థాయిలోనే బీజం పడింది. అక్కడి గ్రంథాలయం ఆయనలోని జ్ఞాన తృష్ణకు నాంది పలికింది. స్కూల్ లైబ్రరీలోనే అనేక గ్రంథాల అధ్యయనం చేశారు. అక్కడే విదేశీ గ్రంథాల పరిచయం కూడా కలిగింది. రష్యన్, బెంగాలీ తదితర భాషల్లో వచ్చిన ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గ్రంథాల అనువాదాలను బాల్యంలోనే చదివారు. తొలొస్తోయ్, తుర్గనేవ్ తదితరుల రచనలతో స్ఫూర్తి పొందారు. ఆ అధ్యయనం సృజనాత్మక రచనల దిశగా నరసింహారెడ్డిని మళ్ళించింది. అప్పట్లోనే శతకరచన చేశారు. పదవతరగతిలోనే బాలల నవలల పోటీ కోసం 'ఊరు మారింది' అనే 120 పేజీల నవల రాశారు. ఆ తరువాత 'సినీయాక్టర్ని' అనే నవల కూడా రచించారు. 'పాఠశాల' అనే పత్రిక కోసం 1983లో తొమ్మిదో తరగతిలోనే శ్రీనాథ మహాకవిపై వ్యాసం రాయడం గొప్ప విశేషం. పైగా అలా రాసిన వ్యాసానికి ప్రథమ బహుమతి రావడంతో సృజనాత్మక రచనల దిశగా మరింత ఆసక్తి పెరిగింది. అలా పాఠశాల, కళాశాల స్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొనేవారు. క్రీడలతో పాటు విద్యార్థి సంఘ నాయకత్వం విషయంలో కూడా చురుకుగా ఉండేవారు. పాఠశాల విద్యార్థి సంఘానికి తొమ్మిదో తరగతిలో కార్యదర్శిగా, పదో తరగతిలో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

అలా సాగుతూ వచ్చిన నరసింహారెడ్డి సాహిత్య కృషి ఇంటర్మీడియట్ దశలోనే ఊపందుకుంది. ఆకాశవాణి యువవాణి కార్యక్రమాల్లో కవిత్వపఠనానికి అవకాశం దొరికింది. డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నప్పుడు రాసిన 'పగిలిన గుండెలు' నవల ఒక దినపత్రికలో డైలీ సీరియల్ గా రెండున్నర నెలలు ప్రచురితం కావడం ఆయనలోని ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది.

సాహిత్య అధ్యయనం, సృజనాత్మక వికాసానికి తోడుగా అకడమిక్ అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయకుండా పట్టుదలతో కృషి చేయడంతో నరసింహారెడ్డి ఏపీపీఎస్సీ ద్వారా గ్రూపు 2 ఉద్యోగం పొందారు. మెదక్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలలో వివిధ స్థాయిల్లో ఉద్యోగాలు నిర్వహించారు. ఐ.ఏ.ఎస్. హోదా పొందారు. మెదక్ జిల్లాలో పని చేసే కాలంలో తహశీల్దార్ గా రాత్రి సమయాల్లో సైతం మంజీర అక్షరప్రభ సాక్షరతా కేంద్రాలను పరిశీలించి, అభ్యాసకులకు ప్రేరణ అందించేవారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి కార్యదర్శిగా ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావడంలో కీలక భూమిక నిర్వహించారు.

ప్రస్తుతం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా విధులు నిర్వర్తిస్తున్న డా. నరసింహారెడ్డి భాషా సాంస్కృతిక శాఖలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. వివిధ కార్యక్రమాల నిర్వహణలో తెలంగాణ సాహిత్య అకాడమీ మొదలైన సంస్థలతో సమన్వయంతో పని చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరుబయట నాటకాల ప్రదర్శనతో ఆహ్లాదాన్ని పంచారు. నాలుగు గోడల మధ్య ఉన్న సాహిత్య, సాంస్కృతిక ప్రపంచాన్ని చక్కటి పచ్చికబయళ్ళ వాతావరణం మధ్యలోకి తెచ్చి, తనలోని కళాహృదయాన్ని నిరూపించుకున్నారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా పాల్కురికి సోమన్న మూలలో కూడా ప్రత్యేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కేవలం కవి సమ్మేళనాలకు పరిమితం కాకుండా కథకులు, నవలాకారుల సమ్మేళనాలు కూడా నిర్వహిస్తుండడం విశేషం.

రచయితగా, కవిగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా, అనువాదకుడిగా, సంపాదకుడిగా డా. నరసింహారెడ్డి సాహిత్య ప్రస్థానం ప్రత్యేకమైనది. ఒకవైపు రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారిగా విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ సాహిత్యసృజనకు ఆయన ఎప్పుడూ విరామం ఇవ్వలేదు. పైగా వచన సాహిత్యంలో కృషి చేస్తూనే మరోవైపు ఛందోబద్ధ పద్యరచన చేశారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన కవి డిలాన్ థామస్, తెలుగు సాహిత్య ప్రపంచంలో నవయుగ కవి చక్రవర్తిగా పేరు పొందిన గుర్రం జాషువా ? ఇద్దరూ తమ కవిత్వంలో బాల్యాన్ని అత్యంత భావోద్వేగంతో వర్ణించారు. ఇద్దరి కవితా వాతావరణాలు వేరైనా బాల్యంలోని స్వచ్ఛతను, అమాయకత్వాన్ని, కాలాన్ని వారిద్దరూ కవిత్వీకరించిన తీరులో కొన్ని సారూప్యాలు, భేదాలు ఉన్నాయి. ఈ విషయంపై దృష్టి సారించిన నరసింహారెడ్డి 'గుర్రం జాషువా, డిలాన్ థామస్ కవిత్వంలో బాల్యం' అనే అంశంపై తులనాత్మక అధ్యయనం చేసి, ఎం.ఫిల్. పట్టా పొందారు. 'తెలుగు, హిందీ జాతీయోద్యమ గీతాలు' అనే అంశంపై పిహెచ్.డి. చేశారు.

**'మట్టిపాట'** అనే పేరుతో శతకరచన చేశారు నరసింహారెడ్డి. ఇది పల్లె జీవన శతకం. గ్రామీణ బతుకు సంగ్రామాన్ని చిత్రించిన శతకం. 'పల్లె బతుకు మాది పాడుగాను' మకుటంతో రాసిన ఈ పద్యాలు పామర, పండిత జనరంజకమయ్యాయి.

**"పల్లెలేల తరిగె పట్నమేల పెరిగె**
**తెలివి తోడ జూడ తేటపడు**
**ప్రపంచ బ్యాంకు బాకు పల్లె బొండిగ తెంచె"**

ఈ విధంగా పల్లెల నుండి పట్టణాలకు వలసల తీరును కవితాత్మకంగా డా. నరసింహారెడ్డి విశ్లేషించిన తీరు పాఠకులను ఆకర్షిస్తుంది. రెవెన్యూ వ్యవస్థపై ప్రజలకు ఉన్న అనేక సందేహాలను నివృత్తి చేస్తూ, రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు సూచిస్తూ ఆయన వెలువరించిన 'తెలుగు రాష్ట్రాల రెవెన్యూ వ్యవస్థ- నిన్న, నేడు, రేపు' ప్రచురించిన వెంటనే ప్రతులు చెల్లిపోయిన గ్రంథం.

రుబాయిల బాబాయి'గా తెలుగు రాష్ట్రాలలో రుబాయిలకు కేరాఫ్ అడ్రెస్ గా నిలుస్తున్నారు నరసింహారెడ్డి. రుబాయిలకు తెలంగాణ నేటివిటీ కల్పించారాయన. ఆయన వెలువరించిన 'తెలంగాణ రుబాయిలు' గ్రంథం పాఠకుల మన్ననలు పొందింది.

**"మనసారా నవ్వగలుగు మాధుర్యం ఆమెలో**
**కడుపారా ఏడ్వగలుగు కారుణ్యం ఆమెలో**
**బేలతనం లేనెలేదు ధీరతయే ఆమె ఉనికి**
**తోటంతా వికసించే పరిమళం ఆమెలో"**

మహిళలపై రాసిన ఈ నాలుగు పంక్తులు స్త్రీల జీవిత ఔన్నత్యానికి అద్దం పడతాయి.

డా॥ ఏనుగు నరసింహారెడ్డి రచనల్లో ప్రతీదీ ఒక ప్రత్యేకతతో ఉంటుంది. ఒక్కోటి పాఠకుల గుండెల్లోకి సూటిగా పోతుంది. అలాంటి అనుభవమే 'ఏడుకోలల బావి' ఎన్నికల శతకాన్ని చదివిన వారికి కలుగుతుంది. ఈ శతకం సీసపద్యమయం. సాధారణంగా సీస పద్యాల చివర ఒక ఆటవెలదో, తేటగీతో చెప్పాలని నియమం ఉంది.

ఈ కవి మరో అడుగు ముందుకేసి, ఈ సీస పద్యాల చివర రెండు తేటగీతులు చేర్చారు. పూర్తిగా ఒక పద్యాన్ని మకుటంగా ఎంచుకున్నారు. రెవెన్యూ శాఖలో విస్తృత అనుభవం ఉన్న అధికారిగా ఎన్నికలపై శతకం రాయడం, దానికి సీస పద్యాలను ఎంచుకోవడం, చివర రెండు తేటగీతులను చేర్చడం, అలతి పదాలతో శతక రచన చేయడం నరసింహారెడ్డికి సమకాలీన సాహిత్య ప్రపంచంలో ప్రత్యేక స్థానం కల్పించే అంశాలు. ఈ శతకాన్ని తన సన్నిహిత మిత్రుడికి చెప్తున్నంత ఆత్మీయ పలకరింపుతో కింది మకుటంతో చెప్పడం పాఠకులను మరింతగా ఆకర్షిస్తుంది.

**"మాయమాటల హామీల మర్మమెరిగి**
**గుర్తులేకుండ ఓటెట్ల గుద్దుతావు**
**ఓరి ఎంకన్న! దోస్తుగా! ఒర్లుబోతు!**
**ఒక్క మాటన్న వినవార! తిక్కలోడ"**

పైన ప్రస్తావించినవే కాకుండా అనేక గ్రంథాలు నరసింహారెడ్డి లేఖిని నుండి వెలువడ్డాయి. 'సమాంతర స్వప్నం', 'నేనే', 'కొత్తపలక', 'మూలమలుపు', 'నీడల దృశ్యం', 'పూలపూల వాన' తదితర కవితాసంపుటాలను; 'అంతరంగం', 'సమాహార', 'ఊహల వేదిక', 'వ్యక్తావ్యక్తం' మొదలైన విమర్శనాగ్రంథాలను వెలువరించారు. ఆయన కవిత్వం భాషా సొబగులతో పరిపుష్టమై, ప్రజల బాధామయజీవితాలకు దర్పణంగా నిలుస్తుంది.

ఆయన విమర్శనా గ్రంథాలు ఆధునిక సాహిత్యానికి తూనికరాళ్ళు ఆయన దగ్గర ఉన్నాయని నిరూపిస్తాయి. 'హైద్రాబాద్ విషాదం', 'అసఫ్ జాహీ సంస్థానం విలీనగాథ' గ్రంథాలు ఆయన అనువాదనైపుణ్యానికి అద్దం పడతాయి. 'ములాఖాత్', 'అస్తిత్వ' తదితర గ్రంథాలకు ఆయన సంపాదక బాధ్యత నిర్వర్తించారు.

తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డిని అనేక పురస్కారాలు వరించాయి. వాటిలో తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కారం, రంజని-కుందుర్తి ఉత్తమ కవితాపురస్కారం, రాజారాం ఫౌండేషన్ రాష్ట్రస్థాయి సాహితీ పురస్కారం, గిడుగు రామ్మూర్తి పురస్కారం మొదలైనవి ఉన్నాయి.

వరంగల్ లోని ప్రముఖ సాహిత్య సంస్థ 'సహృదయ' దివంగత సాహితీవేత్త రాళ్ళబండి కవితాప్రసాద్ పేరిట ఏర్పాటు చేసిన పురస్కారాన్ని జూన్ 7వ తేదీన ప్రదానం చేసింది.

ఈ ఇరువురూ ప్రసిద్ధ సాహితీవేత్తలు కావడం, ఇద్దరూ శతక రచనలు చేయడం, విశ్వవిద్యాలయ డాక్టరేట్లు పొందడం, ఇద్దరూ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా పని చేసిన/ చేస్తోన్నవారే కావడం విశేషం.

వీరిద్దరూ బహుముఖ ప్రతిభ కలిగినవారే కావడం ఈ పురస్కారానికి నరసింహారెడ్డి యోగ్యతను తేటతెల్లం చేస్తుంది. ప్రతి పురస్కారమూ సాహితీవేత్తల బాధ్యత పెంచుతుంది.

ఈ బాధ్యత తెలుగు సాహిత్యం పరిపుష్టం అయ్యేదిశగా ఉంటుందని డా. ఏనుగు నరసింహారెడ్డి భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలు, సృజనాత్మక రచనలు నిరూపిస్తాయి.

ముళ్లమొక్క నుండి ఎదిగే గులాబీ తప్పకుండా ఆ పుష్పపరిమళాన్ని వెదజల్లుతుంది.

ఈ గులాబీ పరిమళ వ్యాపనంతో పాటు గులాబీల సామ్రాజ్యాన్నే రూపొందిస్తుంది.



**-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు**
9441046839

"నరసింహారెడ్డి సాహిత్య ప్రస్థానానికి పాఠశాల స్థాయిలోనే బీజం పడింది. అక్కడి గ్రంథాలయం ఆయనలోని జ్ఞాన తృష్ణకు నాంది పలికింది. స్కూల్ లైబ్రరీలోనే అనేక గ్రంథాల అధ్యయనం చేశారు. అక్కడే విదేశీ గ్రంథాల పరిచయం కూడా కలిగింది. రష్యన్, బెంగాలీ తదితర భాషల్లో వచ్చిన ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గ్రంథాల అనువాదాలను బాల్యంలోనే చదివారు."

"రచయితగా, కవిగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా, అనువాదకుడిగా, సంపాదకుడిగా డా. నరసింహారెడ్డి సాహిత్య ప్రస్థానం ప్రత్యేకమైనది. ఒకవైపు రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారిగా విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ సాహిత్యసృజనకు ఆయన ఎప్పుడూ విరామం ఇవ్వలేదు. పైగా వచన సాహిత్యంలో కృషి చేస్తూనే మరోవైపు ఛందోబద్ధ పద్యరచన చేశారు"

## 'సహృదయ' సంస్థ వారి రాళ్ళబండి కవితాప్రసాద్ స్మారక పురస్కార ప్రదానం



రాళ్ళబండి కవితాప్రసాద్ పేరిట సహృదయ సాహిత్య సంస్థ నెలకొల్పిన పురస్కారాన్ని ఈనెల 7న డా॥ఏనుగు నరసింహారెడ్డి స్వీకరిస్తున్న దృశ్యం. చిత్రంలో ప్రముఖ సాహితీ వేత్తలు డా॥గన్నమరాజు గిరిజామనోహర్ బాబు, వి.ఆర్.విద్యార్థి, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ తదితరులు.

## కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

### జీవన పయనంలో ధైర్యంగా సాగాలి

జీవితం సుఖ దుఃఖాల సాగరం
అన్నింటిని తట్టుకుంటూ పోవాలి
బాదలొచ్చాయని భయపడకూడదు
ఓటమి ఎదురవుతుందని ముందే ఊహించి..
లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం నిలపకు
అడ్డంకులు ఎన్ని ఎదురైనా ఆపకు నీ పయనం
నడిచే దారిలో ముళ్ళు రాళ్లు ఉన్నాయని
పూల బాట కాదు అని బాధపడుతూ కూర్చుంటే
విజయం నీ సొంతం కాదు ఎన్నటికీ
కష్టాలు కలకాలం ఉండవు అనుకుని
ముందుకు సాగుతూ పయనిస్తూ..
సుఖాల తీరం చేరుతావు అని నమ్మకం పెంచుకుని
బాధ్యత మరువక నీ వాళ్లకు భరోసాగా నిలిచే ప్రయత్నంలో..
ఆటుపోట్లు ఎన్ని ఎదురైనా చింతించకు.
కడుపున పుట్టిన వారిని కాచుకునేందుకు ఇన్ని బాధలా అని తల పట్టుకోకు
కాచిన చెట్టుకే కదా కర్ర దెబ్బలు
అందుకే..
జీవన పయనంలో సుడి గాలులు ఎన్ని వచ్చినా బెదరక..
కట్టె కాలే వరకు నిజాయితీగా నిలవాలి.
అపుడే మనకు సమాజంలో మంచి స్థానం లభిస్తుంది.

**-మోదేపల్లి శీనమ్మ**
+91 97048 54615

### ఆది దేవత

ఆది దేవత అమ్మ...
నా చేత తలరాతను మార్చేఅక్షరాలు దిద్దించిన శారదాదేవి,
నా భవితకు కలలుగన్న బంగారుబాటను సిద్ధం చేసిన పార్వతిదేవి,
నాలో అజ్ఞానమనే అంధకారాన్ని రూపుమాపిన సరస్వతీదేవి ,
నా విజ్ఞానానికి అవధులు లేని గమ్యం వేసిన గురువు,
నా మేధో సంపత్తికి అంతేలేని పరీక్షలు పెట్టిన ఉపాధ్యాయిని,
నా జీవన ప్రమాణాలకి ఊహించని ప్రతిఫలం చూపిన తత్వవేత్త,
నా ఆలోచనా సరళిని సన్మార్గంలో నడిపిన దిక్సూచి,
నా ఆవేదనా తరంగాల గమనం మార్చిన శ్రేయోభిలాషి,
నాకు ప్రేమానురాగాలు పంచే వారధిగా మారిన ఆత్మీయపెన్నిధి,
నాకు వెల కట్టలేని ఆదరాభిమానాలను పంచే ఆత్మీయురాలు,
నా అలసటలో విసిగి వేసారకుండా అక్కున చేర్చుకున్న కల్పతరువు,
నా ఆనందంలో తన వంతు పాలు పంచుకున్న స్నేహితురాలు,
నా కవితా దృక్పథానికి చక్కని పునాది వేసిన కామధేనువు,
నా కవితల పూలకు పరిమళాలద్దిన తోటమాలి,
నా ఊహలకు ఊపిరి,
నా ఆశలకు ఆయువు... అన్నీ అమ్మే.... ,
నన్నే నాకు కొత్తగా పరిచయం చేసిన అమ్మా...!
నీకిదే నా వందనమమ్మా...
నా అక్షర నీరాజనం అందుకొనుమమ్మా...!!

**- భూపతి సుమశ్రీ**
+91 85007 89389

### విధిచేతిలో వింత. బొమ్మలు

ఇంటినే వదిలారో
దూరంగా విసిరేయబడ్డారో
నిత్యం కన్నీటి కడవలైన నేత్రాలు
కదిలిస్తే అశ్రువుల గాథలు..
నగరాల్లో, వీధి కూడళల వద్ద..
ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తారు..
చిరిగిన మాసిన దుస్తులతో..
అట్టలు కట్టిన శిరోజాలతో..
దీనంగా చేతులు చేస్తూ..
భిక్షాటన చేస్తూ లేదా దొంగతనాలు చేస్తూ..
కనిపిస్తారు వీధి బాలలు..
తల్లిదండ్రుల అక్రమ సంతానమో..
ముష్టి వాళ్ల చేత చిక్కిన విధి వంచితులో..
రోడ్డు మీద చెత్త ఏరుకుంటూ..
రకరకాల వస్తువులు అమ్ముతూ..
కార్మికులుగా పని చేస్తూ కనిపిస్తారు..
మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు లోనవుతారు..
మత్తులో నేరాలు, ఘోరాలు చేస్తారు..
సరియైన తిండి, నిద్ర వుండదు..
అపరిశుభ్రత వలన అనారోగ్యం పాలవుతారు..
నిరంతరం అభద్రత, మానసిక ఆందోళన..
ప్రభుత్వం, ప్రజలు కలిసి వీరి బాధ్యత తీసుకుని..
భద్రత కల్పించి, చదువు నేర్పించి..
సమాజానికి పనికి వచ్చేలా తయారు చేయాలి..

**-పంతుల లలిత**
+91 82477 57492

### మన చేతల్లోనే ఉంది అంతా

పచ్చ పచ్చని చెట్లతో
గలగల పారే నదులతో
కిలకిల రావాల పక్షులతో
పుడమి పాడింది
ప్రకృతి రాగం నాడు.
యంత్రాల ఘోషల్లో
కాలుష్య కోరల్లో
ప్లాస్టిక్, విషవాయుల కౌగిట్లో
పుడమి నలుగుతుంది నేడు.
మనుషిలో పెరిగే స్వార్థం
చెట్లను నరుకుతున్నాడు
అడవులను ఆక్రమిస్తున్నాడు
నదులను కాలుష్యం చేస్తున్నాడు.
జాలువారే జలపాతాలు
కనుమరుగాయే
ఋతువుల రాగం గతితప్పే
పకృతి పగపట్టే.
నాణానికి ఇరువైపులాన్నట్లు
హరిత శోభ ఓవైపు
మసిబారిన మసక ఓవైపు
మన చేతుల్లోనే ఉంది
పుడమి తల్లి ఆయతి.
చెట్లను నాటు కాలుష్యం నివారించు
నదీ జలాలు కాపాడు
ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టు
జీవజాతులను కాపాడు.
ఓ మనిషి స్వార్థం వీడు
పకృతితో మమేకమవ్వు
స్వచ్ఛమైన గాలులు పీలుద్దాం
భవిష్యత్తరాలకు అందిద్దాం

**-చాగంటి రాణి**
+91 83677 49366

### కలల సౌధము

కలలతో మొదలవుతుంది
ప్రతి ఉదయం,
ఆశలతో నిండిపోతుంది
ప్రతి హృదయం.
చిన్న కల అయినా
చిగురించే దీపమై,
మన జీవిత మార్గానికి
వెలుగై నిలుస్తుంది.
కలలు కేవలం నిద్రలో వచ్చే
చిత్రాలు కావు,
మన గమ్యానికి దారి చూపే
నక్షత్రాలు అవి.
పడి లేస్తూ సాగిన ప్రతి అడుగులో,
విజయపు సౌధాన్ని నిర్మించే శిల్పాలు అవి.
ఒక రైతు కలలో పచ్చని పంటలుంటాయి,
ఒక విద్యార్థి కలలో వెలుగైన భవిష్యత్తుంటుంది.
ఒక శాస్త్రవేత్త కలలో కొత్త ప్రపంచముంటే,
ఒక కవి కలలో మానవత్వపు సంగీతముంటుంది.
కలలే మనసుకు రెక్కలు ఇస్తాయి,
కష్టాల సముద్రాన్నీ దాటించే పడవలవుతాయి.
ఆత్మవిశ్వాసం అనే గాలి వీచినప్పుడు,
అవి విజయ తీరాలకు తీసుకెళ్తాయి.
కలలు కనని జీవితం వెలుగులేని దీపం,
లక్ష్యం లేని ప్రయాణం దారిలేని నావం.
కలలే మనిషిని సాధారణం నుంచి
అసాధారణ శిఖరాలకు చేర్చే మెట్లు.
అందుకే యువత హృదయంలో కలలు మండాలి,
అవి దేశ భవిష్యత్తుకు దివ్యజ్యోతులవాలి.
ప్రతి కల ఒక కొత్త ఉదయాన్ని పిలుస్తూ,
మన భారతాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దాలి

**-కె. కె. రామచందర్**
+91 94934 02139


ఆహ్వానం

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
మరియు
ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం
శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో
శ్రీ కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.
తేది : 19-06-2026, శుక్రవారం, సమయం : సా॥ 6.00 గంటలకు

" శ్రీమతి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభ "

ముఖ్య అతిథి : లయన్ డా॥ వై. ఎమ్. ధర్, లయన్స్ క్లబ్, మాజీ గవర్నర్
సభాధ్యక్షులు : శ్రీ పి. పవన్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త
విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్థన మూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ
గౌరవ అతిథి : శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటి నిజం
పురస్కార గ్రహీత : శ్రీమతి డా॥ పి. భవాని, కన్సల్టింగ్ హోమియో ఫిజీషియన్
ప్రత్యేక ఆహ్వానితులు : శ్రీమతి కె. కామేశ్వరి, ట్యాక్స్ కన్సల్టెంట్
ఆత్మీయ అతిథి : శ్రీమతి పాత్తూరి జయలక్ష్మి, మేనేజర్ సాహితీ కిరణం
పురస్కార ప్రదాత : శ్రీ ఏకా నాగరాజు రామమోహన్ రావు, ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్
వందన సమర్పణ : శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్ధని

లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి
శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్టుమెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్,
మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047. సెల్ : 94404 48650.





# డా॥యం.వి నరసింహారెడ్డి ఇక లేరు ...



నివాళి

బహుగ్రంథకర్త, విద్యావేత్త, సాహితీవేత్త, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సం ఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ యం.వి నరసింహారెడ్డి 2026 జూన్ 8న రాత్రి తుది శ్వాస విడిచారు. ఆయన మరణంతో ఓ గొప్ప విద్యావేత్తను, సాహితీవేత్తను కోల్పోయాం. ఇప్పటి జగిత్యాల జిల్లా తక్కల్లపల్లి గ్రామంలో ముదుగంటి సూర్యమ్మ -హనుమంత రెడ్డి దంపతులకు 1940 జూలై 1 వ తేదీన జన్మించారు. ఎం . ఏ, బి.ఇ డి పూర్తి చేసి విద్యారంగంలోఅనేక సంవత్సరాలు సేవలందించి మండల విద్యాధికారిగా ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎంవి నరసింహారెడ్డి తమ లేత వయసులోనే అనగా 1961 లోనే ప్రేమజీవులు- ఆదర్శ త్యాగాలు నవలను రాశారు. ఆనాటికి అవిభక్త కరీంనగర్ జిల్లాలో నవల రచనను ఎవరు చేపట్టకపోవడం నరసింహా రెడ్డి ప్రథములు కావడం విశేషం. విద్యను అభ్యసించే రోజుల్లో విద్యార్థి సంఘ నాయకునిగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్రంథాలయ డైరెక్టర్ గా సేవలందించిన అనుభవాలన్నీ ఆయన సొంతం చేసుకున్నారు.

యం.వి నరసింహారెడ్డి రచించిన గ్రంథాలు:-ప్రేమ జీవులు - ఆదర్శ త్యాగాలు నవల, జోక్స్ బ్యాంక్, జోక్స్ టానిక్

జోక్స్ టానిక్ (ఇంగ్లీష్) ఆరోగ్య వర్తక్ జోక్స్ (హిందీ), మనోరంజక్ జోక్స్ (హిందీ), విద్యా తత్వము- వ్యాసాలు , విద్యా మానసిక శాస్త్రము తెలుగు బోధనా వద్ధతులు తెలంగాణ తేజం పర్యావరణం, తెలుగు వ్యాకరణ కల్పతరువు

మన తెలుగు కవులు ఋగ్వేదము -తెలుగు వచనానువాదము యజుర్వేదము -తెలుగు వచనానువాదము అధర్వణ వేదము- తెలుగు వచనా నువాదము సామవే దము -తెలుగు వచనాను వాదము వాల్మీకి రామాయణము తెలుగు వచనానువాదము.



సెప్టెంబర్ 5 1991న డా॥ ఎం.వి. నరసింహారెడ్డికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి.

## యం.వి నరసింహారెడ్డి పొందిన పురస్కారాలు

తెలంగాణ ఆవి ర్భావం సందర్భముగా అప్పటి ముఖ్యమంత్రి కే.సీ.ఆర్.చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం

తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం , రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం.

తెలంగాణ తెలుగు భాష సంరక్షణ సంఘాన్ని స్థాపించి సాహితీ సేవలందించారు. తెలంగాణ తెలుగు భాషా సంరక్షక సంఘం శాతవాహన విశ్వవిద్యాలయం కలిసి సంయుక్తంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక వివిధ జిల్లాల సాహితీకారులను దాదాపు 400 మందిని యం.వి నరసింహారెడ్డి సాహితీ పురస్కారాలతో సత్కరించారు.

తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రముఖ సాహితీవేత్త దాస్యం సేనాధిపతితో కలిసి అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కూడా సంరక్షణ సంఘం జిల్లా ప్రముఖ కవి కాలమిస్ట్ డాక్టర్ బి మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి వివిధ సాహితీ కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.

యం .వి నరసింహారెడ్డి జగిత్యాలలో తెలుగు పండిత శిక్షణ కళాశాల, బీఈడీ కళా శాలల స్థాపనలో నిర్వ హణలో క్రియాశీలక పాత్రను పోషించారు.

అనేకమంది ప్రముఖు లతో సాహిత్య సభలను పంచుకున్న నరసిం హారెడ్డి ఇప్పుడు లేక పోవడం సాహితీలో కానికి తీరని లోటు. నరసింహారెడ్డి గారి మృతి పట్ల సాహితీ వేత్తలు, వివిధ రంగా లకు చెందిన ప్రము ఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిం చారు.

నరసింహారెడ్డి గారు ఇప్పుడు లేకున్నా ఆయన కలం నుండి జాలువారిన రచనలు కలకాలం సామాజిక చైతన్యానికి దోహదపడతాయనుకోవడంలో ఏమాత్రం సందేహం లేదు.

**- దాస్యం సేనాధిపతి**
9440525544



శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి కీర్తి పురస్కారం స్వీకరిస్తున్న డా॥ఎం.వి. నరసింహారెడ్డి



మార్చి 21, 2015న డా॥ ఎం.వి. నరసింహారెడ్డికి రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారం ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు.



కవి, రచయిత, విమర్శకుడు దాస్యం సేనాధిపతికి పురస్కారం ప్రదానం చేస్తున్న డా॥ఎం.వి. నరసింహారెడ్డి, వైస్ ఛాన్సలర్ కడారు వీరారెడ్డి తదితరులు.



కవయిత్రి వకుళ వాసుకు ఎం.వి. నరసింహారెడ్డి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే డా॥ సంజయ్ తదితరులు



కుటుంబ సభ్యులతో డా॥ ఎం.వి.నరసింహారెడ్డి.

### చిత్తశుద్ధి!

దేశ భక్తి!!
ఉందా చిత్తశుద్ధి??
దేశం దేశమని
ఆనాడు స్వాతంత్ర్యసమరయోధులు
శతవిధాలపోరి కాలాపానీలో
లాఠీలతో, తూటాలతో
తలలు చిట్లి
నిలవ నీడలేక
ఆక్రోశించి
అసువులు బాసిన అమరవీరుల
భయం భక్తి త్యాగాలతో
ఉరికి ఉరికంబమెక్కిన
వారిది దేశభక్తి
మరుగున పడిన
మహనీయులు మగువలు.
నేడు చెట్టుపేరు చెప్పుకు
కాయలమ్మేరకాలు
నేతిబీరలో నెయ్యి నేటి దేశభక్తి
దేశమును ప్రేమించుమన్నానాడు
అందినంత దోచుకో ఈనాడు
వట్టిమాటల మూటలు
ఊసుపోని కబుర్లు
పక్కవాడికి గొయ్యి తవ్వుతూ
గొప్పలు చెప్పుకుంటున్న రోజులు
గుడిని గుడిలో లింగాన్ని మింగే
మన దేశభక్తి జెండా ఎగరేసి
ఉపన్యాసం దంచేసి
పక్కవాడిది గుటకాయస్వాహా
చివరకు దేశం అంటే ఏమిటి
దేశభక్తితో పనేంటి అనే రోజులు!.

**-ఎ.రాజ్యశ్రీ**

### దేశమంటే మట్టికాదోయ్!

జన్మనిచ్చిన కన్నతల్లి
కన్నతండ్రి
వారసత్వాల తరతరాలకూ
ఆధారభూతమైన మాతృ భూమే
మన దేశం
శ్వాసల నుండి
పలు ఆశలను నెరవేర్చిన
పవిత్ర భూమి
దేశభక్తియే మనశక్తి
చింతల నుండి ముక్తి.
సంస్కృతీ సంప్రదాయాలకు
అనాదిగా విశ్వానికే
మార్గదర్శకమైన
మన దేశం మనకి గర్వకారణం
దేశ భక్తియే మనకి ఆభరణం.
భారతావని
భారతమాత సంతతి మనం
పర్వతశ్రేణులు నదీ ప్రవాహాలు
సాగర సరిహద్దులు
షడృతువులు
ఋతుపవనాలు
భిన్న సంస్కృతుల సంప్రదాయ
సామరస్య జీవన ప్రదాత
మన దేశం
దేశభక్తియే మన శక్తి.
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే జీవన ప్రదాత.
దేశం మనకేమి చేసిందని
అడగకు
దేశానికి
మనమేమి చేసామని
ప్రశ్నించుకో.
దేశమర్యాదని కాపాడుతూ
ప్రశాసనిక విధులను నిర్వర్తిస్తూ
సహకరిస్తూ
దేశవిద్రోహులను ధిక్కరిస్తూ
జాతీయ గీతం, జెండా
చిహ్నాలపై
ఆదర గౌరవ సమర్పణ భావాల
ఆచరణల నిమగ్నమౌతూ
జన్మనిచ్చిన తల్లిదండ్రులతో
సమానంగా
దేశాన్ని అభిమానిస్తూ
గౌరవ ఆదరణలతో
వ్యవహరించడమే
నిజమైన దేశభక్తి
మనం చూపించగల అపార శక్తి.

**-రాజప్ప**

### నా బాధ్యత

స్వాతంత్ర్య కాంక్ష కాదు
పతాకం ఎగరేయడం కాదు
ఎవరెస్టు లాంటి
గుండె నిబ్బరం
జీవనదిలాంటి
పవిత్ర జీవన ప్రవాహం
దేశమంటే మట్టికాదోయి
దేశమంటే
మనుషులోయి పాడడం.
హిమవత్పర్వతాలలాంటి
గుండె నిబ్బరం
గంగా యమునల లాంటి
పవిత్ర జీవన ప్రవాహం
దేశమంటే మట్టి కాదోయ్
మనుషులన్నాడు మహాకవి
ఆ మనుషుల
మనసులను గెలిచేవాడే
నిజమైన దేశరవి!.
దేశభక్తి అంటే
పరిపాలించడం కాదు
దేశంకోసం త్యాగం చేయడం
పర్యావరణాన్ని పరిరక్షించడం
శాంతి సహనంతో మెలగడం
నా సేవ నా బాధ్యతగా
వ్యవహరించడం
నాదేశం నా ప్రాణం
అనుకోవడం.
హిమవత్ శిఖరాల సాక్షిగా
సముద్ర కెరటాల ఘోషగా
మువ్వన్నెల జెండా నీడన
మురిసిపోతోంది
భరతావని!.
కులాల గోడలు తెంచేస్తూ
మతాల భేదం తుంచేస్తూ
భిన్నత్వంలో ఏకత్వాన్ని
చాటి చెపుతోంది
ఈ ధరణి!.
స్వేచ్ఛను ఇచ్చిన వీరులను
రక్తం చిందించిన త్యాగులను
ప్రతిక్షణం మనం తలుస్తూ
ముందుకు సాగుదాం
వందనమిస్తూ!.
పల్లె పల్లెనా ప్రగతి బాట
గుండె గుండెనా దేశపు మాట
జై భారత్ అంటూ సాగుదాం
నవభారత చరిత్రను రాసేద్దాం!
దేశభక్తి దశదిశలా చాటుదాం
నవయువతకు
నా బాధ్యతని తెలుపదాం!.

**-గుండవరం కొండల్ రావు**

### దేశభక్తా అదెక్కడ?

నేను నాది అనే స్వార్థంతో
అన్నీ నాకే అంతా నాదే అని
పెదవుల మీద వచ్చే మాటలు
హృదయం లోంచి గాక
మీ కొరకే మేమంటూ
సమాజ హితమే మా లక్ష్యమని
శరీరం బుద్బుదమని తెలిసికూడా
దేశాన్ని ఉద్ధరించడం కోసమే
జన్మించామని చెప్పే
ప్రజాపాలకులే కాదు
సామాన్యుడు కూడ
ప్రవర్తిస్తున్న నేటి సమాజంలో
నాడు దేశంకోసం సర్వస్వం అర్పించిన
మహనీయులు
నేడు దేశాన్ని దోచుకునేదేశద్రోహులు
దేశ భక్తా అదెక్కడ ?.

**-ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్**

### గణ గణమని ఓహో జయహో

పాడుతా పాడుతానాకు
దేశభక్తిఎక్కువే
దేశభుక్తి నాకిష్టం.
రాజకీయ నాయకుడను
మైకంటే మైకంనాకు
దేశమంటే దోచుకొనే...
తప్పుతప్పు..
దాచుకొనే గొప్పసంపద.
పవిత్ర పుణ్య చరిత్రలు
చాపచుట్టుడే నాకు.
గొప్పోరికి వందనాలు
పెద్దోళ్ళు మన మార్గదర్శకులు.
పేదోళ్లను ఉచితాలతో
చిచ్చిగొట్టాలిగదా.
రెచ్చిపోయే పిచ్చికుక్కలకు
కచ్చితంగా కటకటాలే.
నా దేశభక్తి ఉగ్గుపాలతో
భగ్గుమన్నది
బడా నాయకుణ్ణయ్యాను.
దేశభక్తి నాలో తిరుగుతుంది
రుధిరానికిబదులు.
పేదోళ్ళే నా పెన్నిధి
వాళ్లకు ఉచితాలిచ్చి ఉన్నచోటే
కన్న బిడ్డల్లా కాచుకుంటా.
నాభుక్తికి దేశభక్తి
విరక్తి కలిగించని భోజనం.
రాజకీయం
అరాచకియమైందన్నమాట
అబద్ధం.
రాజకీయమే అరాచకం
నేను మాత్రం పవిత్రం.
దేశభక్తితో తడిసి ముద్దయిన
నాముందు తరాన్ని స్మరిస్తా నిరంతరం.
వారిచ్చిన సింహాసనం
నాకు పట్టుపాన్పు.
దేశభక్తి గొప్పతనం
కప్పుకున్నది దుప్పటి.
నేటి దేశభక్తికి నిదర్శనం
నావంటి కుంపటే.
వెచ్చదనం కలిగిస్తా
అచ్చమైన దేశభక్తి చూపిస్తా.
ముగిస్తా ఇంతటితో
నా ఉపన్యాసం.
నాలో కోర్కెలు ఏవి లేవండి
నేను తీసుకున్నసన్యాసం
నాలాంటి దేశభక్తిగల సన్యాసికి
మళ్లీ మళ్లీ ఓటేసి గెలిపిస్తే
మీకు కలుగు
కోటి శుభాలు సుమండీ.

**-డా.సి.వసుంధర**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1798వ రోజు 'దేశభక్తి' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'దేశభక్తి' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



### సమైక్యతా శక్తి!

పరాయి పాలన వద్దంటూ
బానిస శృంఖలాలను తెగతుంచిన
సత్యం అహింసా శాంతి సిద్ధాంతం
స్వాతంత్ర్యసమరం సాగించిన
అమరవీరుల త్యాగధనం
మన స్వాతంత్ర్యం..
'దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్'
దేశం కోసం-జాతికోసం
తూటాలకు ఎదురొడ్డిన
వీరుల ధీరత్వం-వీరత్వం
స్వాతంత్ర్య భారతం.
స్థాపించిన ప్రజారాజ్యంలో
రైతన్నకు లేదు
స్వేచ్ఛా స్వాతంత్ర్యం
రోజు రోజుకి
దిగాలుపడిపోతున్న పేదరికం
ఉన్నోడిది రాజ్యం-రాజ్యాంగం
బానిస బతుకులు
వీడని ప్రజారాజ్యంలో
అధికారం కోల్పోతున్నారు
అనాథలై బ్రతుకుతూ..
సస్యశ్యామల భారతాన్ని
నిర్జీవం చేస్తున్న
పాలకుల పథకాలు
కోట్లను దాటేస్తూ
రుణాల ఊబిలో
తోసేస్తున్న జనజీవితం.
నాదీ నీదీ అనుకొంటూ
తలా కొంచెం
పంచుకుంటున్నస్వార్థం
75 సంవత్సరాల నిండినా
తాతల మూతులు
నాకుతున్న వైభోగం..
మారాలీ బ్రతుకులు
రావాలీ మార్పులు
భావితరాలబాలల బ్రతుకులు
వెట్టిచాకిరీకి బలి అవుతున్న
బంగరు భారతం
అధికారాల అణచివేతకు
గురి అవుతున్న
పేదల బతుకులు
కుల మత వర్గ
జాతి విచక్షణలతో
బేధాలను సృష్టిస్తున్న
పదవీ అధికారాలు
అవినీతి దందాలతో
స్వాతంత్ర్యేచ్ఛను దోచేస్తున్న
పాలనావ్యవస్థలు
ప్రగతి పథంలో
అవ్యవస్థిత ప్రజాస్వామ్యంలో
జాతీ నీతీ అవనతమౌతూ
పాటించని సమైక్యతా
సిద్ధాంతాన్ని..?

**-పి.పద్మావతి**

### అసలైన దేశభక్తి


టాటూలూ బ్యాడ్జీలూ
తగిలించుకుని ప్రదర్శించడమా?
స్వీట్లు పంచుకుని
కోలాహలం చేయడమా?
జెండా ఎగిరేసామనిపించి
జనగణమన పాడేయడమా
సెలవుదినమంటూ
సంబరం చేసుకోవడమా?!.
దేశభక్తి అంటే?!
వందేమాతరం వినిపించగానే
హృదయం గౌరవంతో, గర్వంతో
పులకరించి ఉప్పొంగేది
జైహింద్ నినాదంతో
శత్రువుల గుండెల్లో
వణుకు పుట్టించేది!.
స్వసుఖాన్ని సౌకర్యవంతమైన జీవితాన్ని
అంతులేని సంపదను
తృణప్రాయంగా త్యజించి
ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడిన
లెక్కకు మిక్కిలి యోధుల
వీరనారీమణుల త్యాగ ఫలితం
మనం స్వేచ్ఛగా అనుభవిస్తున్న
స్వపరిపాలన స్వాతంత్ర్యఫలం!.
అవినీతిలో అగ్రస్థానంలో
అత్యాచారాల్లో
తలవంచుకు సిగ్గుపడే స్థానంలో
నిలపటమా..
స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను
దుర్వినియోగపరచటమా..
మనం దేశానికిచ్చే ప్రతిఫలం?!.
సక్రమ కర్తవ్య నిర్వహణ
బాధ్యతల సమర్థ నిర్వహణ
నైతిక విలువలు కలిగిన ప్రవర్తన
పర్యావరణ పరిరక్షణకై పట్టుదల
దేశ పౌరులంతా కలిగి ఉండడమే
అసలైన దేశభక్తి!.
అప్పుడే కదా..
'ఏ దేశమేగినా,ఎందు కాలిడినా..'
అంటూ రాయప్రోలు గేయాన్ని
అపరాధభావం లేకుండా గర్వంగా
పాడుకోగలం!.

**-చంద్రకళ దీకొండ**

### దేశం కోసం ప్రాణాలర్పించే భక్తి

దేశభక్తి అంటే దేశంపై భక్తి!
భరతమాత విశృంఖలతకై
పోరాడే భక్తి!
లాఠీలకు, తూటాలకు
ఎదురేగే భక్తి!
ఉరికంబమెక్కడానికి
భయపడని శక్తి!
జైలుకెళ్ళడానికైనా
వెనకాడని ధైర్యం!.
తెల్ల చొక్కా ధరించే
మేకవన్నె పులులు
స్వార్థంతో హత్యలకు
వెనుకాడని నీచులు,
పరుల ఆస్తులను
మోసంతో దోచేవారు
వేదికపై ఊకదంపు
ఉపన్యాసం ఇచ్చేవారు
మొక్కుబడిగా
జెండా ఎగరేసేవారు
మిఠాయిలో, పళ్ళో
పంచే వంచకులు
దేశభక్తులు కానేరరు ఎన్నడూ!.
సౌఖ్యాన్ని, సంపదను త్యజించి
ప్రాణాన్ని తృణప్రాయంగా తలచి
తెల్లవారిని ఎదిరించిన
ధీరులే దేశభక్తులు!
వీర నారుల త్యాగఫలమే
మన ఆజాదీ!
ఏ దేశమేగినా
ఎందు కాలిడినా
మన దేశ ఘనతను
చాటుటే దేశభక్తి!
తల్లిదండ్రులపై అనురాగం
అక్కచెల్లెళ్ల ఆదరణతో మొదలై
పరోపకారంతో నిండితేనే దేశభక్తి!
ప్రతి మనిషిలో
దేశభక్తి ఉండాలి నిండుగా!!.

**-కోలా సత్యనారాయణ**




### దేశభుక్తి

భక్తో భుక్తో
చెక్క భజనో
పక్కోడి పూజనో
దేశభక్తో ఈర్ష్యా భక్తో.
భక్తి పేరుతో దేవుణ్ణి
గుళ్ళో లింగాన్ని సైతం
గుటకాయ స్వాహా
దేశాన్ని దోచే దొంగలు
భక్తి ఎక్కువై తిన్నదరుగక
తరతరాలకు కూచుని తిన్నా
తరగని ఆస్తిపాస్తులు.
తనువు త్యజించి
మనసులో భజిస్తూ
దేశం కోసం త్యాగం చేసిన
మహనీయులు ఆనాడు
ఈనాడు వెతుక్కోవాలి మరి!!.

**-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి**

# భారత ప్రజాస్వామ్యం పునర్నిర్మాణం



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
బీసీ కమిషన్ తొలి ఛైర్మన్,
తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం మరియు అత్యంత పురాతన ప్రజాస్వామ్య దేశమైన అమెరికాల రాజ్యాంగ నిర్మాణాలు పౌరుడికి స్వేచ్ఛను, సమానత్వాన్ని ప్రాథమిక హక్కులుగా ప్రకటించాయి. 1950 జనవరి 26న అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం పౌరుడికి ఓటు హక్కును కల్పించడం ద్వారా పాలకులను ఎన్నుకునే సర్వాధికారాన్ని సామాన్యుడి చేతిలో పెట్టింది. అయితే, ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత ప్రయాణం తర్వాత నేడు ఒక ప్రాథమిక ప్రశ్న ప్రజాస్వామ్యవాదులను వేధిస్తోంది: "భారత పౌరుడు నిజంగానే సార్వభౌముడా? లేక కేవలం పరిపాలనాధికారి (బ్యూరోక్రసీ) విచక్షణకు లొంగి బతికే ఒక యాచకుడా?

మన ఓటింగ్ వ్యవస్థలు మరియు పౌరసత్వ ధృవీకరణ ప్రక్రియలు ఇంకా వలసరాజ్యాల కాలం నాటి ఐఏఎస్-కలెక్టరేట్ వ్యవస్థల చేతుల్లోనే బందీగా ఉండిపోవడం ఒక చారిత్రక విషాదం. ఎన్నికల నిర్వహణలో వస్తున్న డేటా వ్యత్యాసాలు, పౌరసత్వ సవరణ చట్టాల (CAA) నేపథ్యంలో తలెత్తుతున్న భయాలు, మరియు జిల్లా స్థాయిలో సామాన్య పౌరుడు తన అస్తిత్వ పత్రాల కోసం బ్యూరోక్రసీ ముందు మోకరిల్లాల్సి వస్తున్న ప్రస్తుత దయనీయ పరిస్థితిలో... భారత ప్రజాస్వామ్యాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకోసం కేంద్ర, రాష్ట్ర జిల్లా స్థాయిలో ఐఏఎస్, ఐపిఎస్ ల వలె ఐసీఏ వ్యవస్థను కలెక్టర్, ఎస్పీల తరహాలోనే "పౌర హక్కుల సంరక్షణ" కోసం ఒక స్వతంత్ర మూడో స్తంభాన్ని (3rd Pillar) ఏర్పాటు చేయడమే ఏకైక మార్గం.

### 1. ఓటు హక్కు: ప్రాథమిక హక్కుగా మార్చాల్సిన చారిత్రక ఆవశ్యకత

భారత రాజ్యాంగంలోని 3వ భాగంలో ఆర్టికల్ 12 నుండి 35 వరకు పౌరులకు ప్రాథమిక హక్కులను కల్పించారు. కానీ, ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటి ఓటు హక్కును మాత్రం ఈ భాగంలో చేర్చకుండా, 15వ భాగంలోని ఆర్టికల్ 326 కింద ఎన్నికలు అనే అంశంలో ఒక సాధారణ రాజ్యాంగబద్ధ /చట్టబద్ధ హక్కుగా చేర్చారు. ఓటు హక్కుతో పాటు సమాచార హక్కు, వినియోగ దారుల హక్కు, వినియోగ దారుల ఫోరం ప్రాథమిక హక్కులకు సంబంధించిన 19 వ ఆర్టికల్‌లో చేర్చడం అవసరం.

## తప్పుడు నినాదాలు

కామన్ సివిల్ కోడ్ అమలు చేయడం, జనాభా నియంత్రణకు మేమిద్దరా మాకొకరు లేదా ఇద్దరితో ఫుల్ పెట్టాలి. అంతేగాని బాగా కనండి అనే తప్పుడు నినాదం ఆకలిచావులకు, పరస్పర యుద్ధాల్లో కోట్లాది జనం చంపడానికి ఇలాంటి నినాదాలిస్తారు. బాగా కనండి అనే నినాదం జర్మనీ నియంత ఇచ్చిన నినాదం అని గుర్తు పెట్టుకోవాలి.

## మూడేళ్ల కోసారి ఎన్నికలు

టెక్నాలజీ, సమాచార, వ్యవస్థ, రవాణా సౌకర్యాలు పెరిగాయి. మార్పులు వేగ వంతమవుతున్నాయి. కనుక ఎన్నికలు మూడేళ్ల కొకసారి నిర్వహించడం అవసరం. వీరిని ఎన్నుకొని పొరపాటు చేసామను కున్నపుడు తొలగించే వీటో వ్యవస్థ లేనందున ఈ మార్పు అవసరం. అలాంటి వారిని మూడేళ్లకే వదిలించుకోవచ్చు. ముఖ్య మంత్రి, ప్రధాన మంత్రి వంటి పదవుల్లో మొత్తం జీవితంలో ఎనిమిదేళ్లకు మించ కూడదు.

ఓటు హక్కును రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (భావప్రకటన స్వేచ్ఛ), మరియు 32 ఆర్టికల్ పరిధిలోకి తీసుకువస్తూ "ప్రాథమిక హక్కు" (Fundamental Right) గా ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రస్తుతం సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం... మనం పోలింగ్ బూత్‌లోకి వెళ్ళి అభ్యర్థిని ఎంచుకునే 'స్వేచ్ఛ' (Freedom of Voting) మాత్రమే ఆర్టికల్ 19(1)(జీ) కిందకు వస్తుంది, కానీ 'ఓటు వేసే హక్కు' (Right to Vote) కేవలం చట్టబద్ధమైనది మాత్రమే.

ఓటు హక్కు అనేది పూర్తిస్థాయి ప్రాథమిక హక్కుగా మారితే, ఏ ప్రభుత్వ చట్టం కూడా పౌరుడి ఓటును తాకలేదు. ఒకవేళ ఓటును నిరాకరిస్తే, పౌరుడు నేరుగా ఆర్టికల్ 32 ప్రకారం సుప్రీంకోర్టును ఆశ్రయించే హక్కు లభిస్తుంది. ఓటు హక్కును ఆర్టికల్ 19 లో అంతర్భాగం చేయడం ద్వారానే పౌరుడికి చట్టబద్ధమైన రక్షణ లభిస్తుంది.

అమెరికా (USA) విధానం: అమెరికా వంటి సాంకేతిక అగ్రరాజ్యం కూడా డిజిటల్ ఓటింగ్ యంత్రాలపై నమ్మకం లేక, 70% కంటే ఎక్కువ స్థానాల్లో "హ్యాండ్-మార్క్డ్ పేపర్ బ్యాలెట్" (Hand-Marked Paper Ballot) విధానాన్ని వాడుతోంది. అక్కడ పౌరుడు చేత్తో కాగితంపై మార్క్ చేస్తాడు, దానిని ఆప్టికల్ స్కానర్ ద్వారా లెక్కిస్తారు. వివాదం వస్తే సరిచూడటానికి అసలైన పేపర్ రికార్డు భద్రంగా ఉంటుంది.

**యూరప్ దేశాలు:** జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో పారదర్శకత లేదని భావించి, వాటిని పూర్తిగా నిషేధించి తిరిగి సాంప్రదాయ పేపర్ బ్యాలెట్ వాడు తున్నారు. మనం కూడా బ్యాలట్ పేపర్ కు మారడం అవసరం. అపుడు అందరి అనుమానాలు తీరుతాయి. ఎన్నికలపై విశ్వాసం పెరుగుతుంది.

### 2. పౌరసత్వం (ఆర్టికల్ 5-11): బ్యూరోక్రసీ చేతిలో పౌరుడి అస్తిత్వం

భారత రాజ్యాంగంలోని 2వ భాగంలో ఉన్న ఆర్టికల్ 5 నుండి 11 వరకు పౌరసత్వాన్ని (Citizenship) నిర్వచిస్తాయి. ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన CAA (పౌరసత్వ సవరణ చట్టం) వంటి పరిణామాలు దేశంలో పౌరసత్వ గుర్తింపును ఒక పెద్ద వివాదాస్పద అంశంగా మార్చాయి.

ప్రస్తుత వ్యవస్థలో ఒక వ్యక్తి భారత పౌరుడా కాదా అని నిర్ణయించే విచక్షణాధికారాలు ఎవరి చేతుల్లో ఉన్నాయి? క్షేత్రస్థాయిలో ఉన్న తహశీల్దార్, ఆర్డీఓ, లేదా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్ పి చేతుల్లో ఉన్నాయి. ఒక సాధారణ రెవెన్యూ అధికారి తన విచక్షణతో లేదా రాజకీయ ఒత్తిళ్లతో ఒక సామాన్య పౌరుడి అస్తిత్వాన్ని, పౌరసత్వాన్ని ప్రశ్నార్థకం చేయగలరు. ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, రేషన్ కార్డు వంటి పౌర గుర్తింపు పత్రాల జారీ ప్రక్రియ అంతా వేర్వేరు బ్యూరోక్రాటిక్ విభాగాల కింద ముక్కలు ముక్కలుగా విడిపోయింది.

ఒక ఐఏఎస్ అధికారి లేదా పరిపాలనా యంత్రాంగం యొక్క విచక్షణకు 140 కోట్ల భారత పౌరులు లొంగిపోయి బతకవలసి రావడం ప్రజాస్వామ్య నిరంకుశత్వానికి పరాకాష్ఠ. పౌరసత్వం అనేది ఒక వ్యక్తి జీవించే హక్కుతో ముడిపడిన అంశం కాబట్టి, దానిని పర్యవేక్షించే అధికారం కేవలం కార్యనిర్వాహక వర్గానికి కాకుండా, న్యాయమూర్తి స్థాయి అధికారాలు ఉన్న ఒక స్వతంత్ర రాజ్యాంగ బద్ధ సంస్థకు అప్ప గించాలి.

### 3. కేంద్ర ఎన్నికల సంఘం (ECI): జవాబుదారీతనం లేని స్వతంత్రత

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 కింద ఎన్నికల సంఘానికి కల్పించిన స్వతంత్రత... కాలక్రమేణా దానికి జవాబుదారీతనం లేకుండా చేసిందిఅనే అనుమానం కలుగుతోంది. ఒకప్పుడు టి.ఎన్. శేషన్ ఐఏఎస్ గారి హయాంలో జరిగిన సంస్కరణల తర్వాత, ఏకసభ్య కమిషన్ కాస్తా ముగ్గురు సభ్యుల, ముగ్గురు ఐఏఎస్ అధికారుల కమిషన్‌గా మారింది. కానీ, కేవలం సంఖ్యను ముగ్గురికి పెంచినంత మాత్రాన వ్యవస్థలో పారదర్శకత రాదు.

ప్రస్తుత ఎన్నికల సంఘం పార్లమెంటుకు నేరుగా జవాబుదారీగా లేదు. ఎన్నికల నిర్వహణలో లోపాలు జరిగినా, ఓట్ల లెక్కింపులో లక్షల తేడాలు వచ్చినా... ఈ ముగ్గురు ఐఏఎస్ అధికారులను ప్రశ్నించే ప్రత్యక్ష అధికారం సామాన్య పౌరుడికి కానీ, చట్టసభలకు కానీ లేకుండా పోయింది. వారిని పదవి నుండి తొలగించాలంటే పార్లమెంటులో అత్యంత కఠినమైన 'ఇంపీచ్‌మెంట్' తీర్మానం జరగాలి. అది సులభం కాదు.

సుప్రీంకోర్టులో 30 మందికి పైగా న్యాయమూర్తులు ఉండి రకరకాల బెంచ్‌లుగా కేసులను విచారించినట్లుగా, అంతటి అత్యున్నత ఎన్నికల సంస్థలో కూడా సభ్యుల సంఖ్యను భారీగా పెంచాలి. అందులో కేవలం అధికారులను మాత్రమే కాకుండా, న్యాయ నిపుణులను, సామాజిక శాస్త్రవేత్తలను భాగస్వామ్యం చేయాలి. ఎన్నికల సంఘం పార్లమెంటుకు మరియు దేశ పౌరులకు నేరుగా జవాబుదారీగా ఉండేలా రాజ్యాంగ సవరణ జరగాలి.

### 4. విప్లవాత్మక ప్రతిపాదన: జిల్లా స్థాయిలో 'మూడో స్తంభం' (District Civil Rights Authority)

ప్రస్తుతం జిల్లా పరిపాలన అంతా రెండు స్తంభాలపై నడుస్తోంది:

జిల్లా కలెక్టర్ (IAS): పరిపాలన, రెవెన్యూ, భూమి రికార్డులు, సంక్షేమ పథకాలు.

జిల్లా ఎస్పీ (IPS): శాంతిభద్రతలు, నేరాల అదుపు.

ఎన్నికల సమయంలో ఇదే జిల్లా కలెక్టర్ "జిల్లా ఎన్నికల అధికారి" (District Election Officer) గా వ్యవహరిస్తారు. కలెక్టర్‌కు వందలాది పరిపాలనా బాధ్యతలు ఉండటం వల్ల, వారు ఎన్నికల నిర్వహణను కిందిస్థాయి సిబ్బందికి వదిలేస్తారు, ఇది అనేక అక్రమాలకు, లీకేజీలకు దారితీస్తోంది.

దీనికి పరిష్కారం: జిల్లా స్థాయిలో మూడో స్వతంత్ర అధికారిగా 'జిల్లా పౌర హక్కుల అధికారి' (District Civil Rights Officer - DCRO) పోస్టును సృష్టించడం. కలెక్టర్, ఎస్పీలతో సమానమైన హోదా, అధికారాలు ఈ వ్యవస్థకు ఉండాలి. ఎస్సీ, బీసీ, ఎస్టీ కమిషన్ల వలె ఇది పూర్తిగా స్వతంత్రంగా రాజ్యాంగ బద్ధ సంస్థ గా పనిచేసే "జిల్లా పౌర హక్కుల అథారిటీ" (DCRA) గా మారాలి.

## ఈ 'మూడో స్తంభం' యొక్క అధికారాలు - బాధ్యతలు:

న్యాయమూర్తి అధికారాలు (Judicial Powers): ఈ సంస్థకు నేతృత్వం వహించే వ్యక్తి ఐఏఎస్ అధికారి కాకూడదు. హైకోర్టు పరిధిలో ఉండే ఒక డిస్ట్రిక్ట్ జడ్జ్ (District Judge) స్థాయి న్యాయాధికారి దీనికి చైర్మన్‌గా ఉండాలి. దీనివల్ల బ్యూరోక్రసీ విచక్షణ స్థానంలో న్యాయబద్ధమైన విచారణ జరుగుతుంది.

ఆర్టికల్ 5-11 ల పూర్తి పర్యవేక్షణ: పౌరసత్వ వివాదాలు, ఎన్ఆర్‌సి (NRC) లేదా సిఏఏ (CAA) కి సంబంధించిన ధృవీకరణలన్నీ ఈ జుడీషియల్ అథారిటీ పరిధిలోనే జరగాలి. ఏ సాధారణ రెవెన్యూ అధికారి పౌరుడిని వేధించడానికి వీలుండదు.

అన్ని పౌర గుర్తింపుల ఏకీకరణ (Single Window): ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, ఓటర్ ఐడీ, మరియు రేషన్ కార్డుల జారీ, నిర్వహణ అధికారాలన్నీ ఈ సివిల్ రైట్స్ అథారిటీకే అప్పగించాలి.

స్వయంచాలక ఓటర్ నమోదు (Automatic Voter Enrollment): ఒక పౌరుడికి 18 ఏళ్లు నిండగానే, ఈ స్వతంత్ర సంస్థే ఆధార్ కార్డు డేటా ఆధారంగా బయోమెట్రిక్ వెరిఫికేషన్ పూర్తి చేసి ఓటర్ ఐడీని జారీ చేయాలి. దీనివల్ల ఓట్ల చేర్పులు, తొలగింపుల లో రాజకీయ నాయకుల, కలెక్టరేట్ సిబ్బంది అవినీతికి ఆస్కారం ఉండదు.

### 5. ఐఏఎస్‌కు ప్రత్యామ్నాయం: 'ఇండియన్ కాన్‌స్టి ట్యూషనల్ అథారిటీ (ICA) వ్యవస్థ

జిల్లా స్థాయిలో మూడో స్తంభాన్ని నిలబెట్టడం ఒక ఎత్తయితే, ఆ వ్యవస్థను నడిపించడానికి తగిన సమర్థవంతమైన, నిష్పాక్షికమైన అధికారుల కేడర్‌ను తయారు చేయడం మరో ఎత్తు. ప్రస్తుతం దేశంలో ఉన్న ఐఏఎస్ (IAS) వ్యవస్థ బ్రిటీష్ కాలం నాటి 'రెవెన్యూ వసూళ్లు, నియంత్రణ' (Collector/Magistrate) మనస్తత్వంతోనే సాగుతోంది. వీరికి చట్టాలు అమలు చేయడం తెలుసు కానీ, రాజ్యాంగ స్ఫూర్తిని, పౌర హక్కులను రక్షించాలనే జుడీషియల్ విచక్షణ (Judicial Discretion) తక్కువగా ఉంటుంది.

దీనికి పరిష్కారంగా... ఐఏఎస్, ఐపీఎస్ తరహాలోనే "ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ అథారిటీ" (Indian Constitution Authority - ICA) అనే సరికొత్త కేడర్ వ్యవస్థను భారత రాజ్యాంగం ద్వారా రూపొందించాలి. ఈ సర్వీసుకు ఎంపికయ్యే అధికారులు కేవలం ఒక విభాగానికే పరిమితం కాకుండా, ఐ ఏ ఎస్ కు మించి బహుముఖ పాత్రలను పోషించేలా చట్టపరమైన వెసులుబాటు కల్పించాలి.

### 6. ఈ 'ఐసిఏ' (ICA) వ్యవస్థ పనిచేసే తీరు మరియు ప్రత్యేకతలు:

మల్టీ-డొమైన్ బదిలీలు (Multi-Domain Mobility): ఈ ఐసిఏ (ICA) అధికారులు ఐఏఎస్ అధికారుల లాగానే సచివాలయంలో, ప్రభుత్వంలోని ఏ శాఖలోనైనా (ఎన్నికలు, పౌరసరఫరాలు, హోంశాఖ, సంక్షేమం మొదలైనవి) అత్యున్నత పోస్టులలో నియమితులు కావచ్చు.

న్యాయ వ్యవస్థతో అనుసంధానం (Judicial Linkage): వీరు కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, ఒక ప్రత్యేక డెప్యుటేషన్ లేదా బదిలీ (Transfer) ప్రక్రియ ద్వారా జిల్లా కోర్టులలో న్యాయమూర్తులుగా (Judiciary) లేదా క్వాసి-జుడీషియల్ ట్రిబ్యునళ్ల అధిపతులుగా కూడా బాధ్యతలు చేపట్టేలా ఈ వ్యవస్థను డిజైన్ చేయాలి.

లాభం: ఒక అధికారి పరిపాలనా రంగాన్ని (Executive) మరియు న్యాయ రంగాన్ని (Judiciary) రెండింటినీ క్షేత్రస్థాయిలో చూడటం వల్ల... వారు ప్రభుత్వ శాఖల్లో ఉన్నప్పుడు రాజ్యాంగ బద్ధంగా, న్యాయబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటారు.

**నిరంకుశత్వానికి అడ్డుకట్ట:** రేషన్ కార్డుల రద్దు, ఆధార్ లోపాలు, ఓటర్ల తొలగింపు, పాస్ పోర్టు వంటి విషయాల్లో ఈ అధికారులు సాధారణ బ్యూరోక్రాట్ల లాగా కాకుండా, ఒక జడ్జి లాగా రెండు వైపులా విచారించి నిర్ణయం తీసుకుంటారు. దీనివల్ల పౌరుల హక్కులకు పూర్తి భద్రత లభిస్తుంది. ఈ అధికార్లు నిరంతరం భారత రాజ్యాంగ లక్ష్యాలను సాహిత్య సాంస్కృతిక, కళా రూపాల్లో ప్రచారం చేస్తారు. విద్యార్థులకు రాజ్యాంగం పై పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తారు. ఈ విధంగా ఈ శాఖ సంఘ సంస్కరణను సంఘ సంస్కర్తల కర్తవ్యాలను నిర్వహించడం జరుగుతుంది.

### 7. బ్యాంకులు, స్టాక్ మార్కెట్ లేని నూతన సమాజ నిర్మాణం:

ఆర్థిక అసమానతలు తగ్గడానికి, ఆర్థిక దోపిడి బదలాయింపు తగ్గడానికి బ్యాంకులు లేని, షేర్ మార్కెట్, స్టాక్ మార్కెట్ వ్యవస్థ లేని నూతన డిజిటల్ సమాజం ట్రస్ట్‌లు ట్రస్టీ షిప్ లను ఏర్పాటు చేసుకోవాలి. పారిశ్రామిక వేత్తలు మీడియా పత్రికా రంగంలోకి రాకుండా నియమ నిబంధనలు రూపొందించుకోవాలి. హౌజింగ్ బోర్డుద్వారా అందరికీ వెయ్యి చదరపు అడుగులు తగ్గకుండా, 2500 చ. అ. వరకు ఇళ్లను, అపార్టు మెంట్ల ను నిర్మించి లోన్ పై నెలవారీ కిస్తుల పై అందజేయాలి. తద్వారా 250 రకాల నైపుణ్యాలకు ఉపాధి లభిస్తుంది. అలా పది కోట్ల మందికి ఉపాధి పెరుగుతుంది.

విద్య వైద్యం అందరికి ఉచితం చేసి ప్రాథమిక హక్కులు 19 ఆర్టికల్ లో, 32 ఆర్టికల్ లో చేర్చడం అవసరం. వ్యవసాయాన్ని ఉపాధి, ఉద్యోగంగా మార్చి సకల సౌకర్యాలు సబ్సిడీలు అందించాలి.

### 8. ఒకే అర్హత ఉన్న ఉద్యోగాలకు ఒకే పరీక్ష:

తద్వారా ప్రభుత్వాలకు, అభ్యర్థులకు, ఆయా సంస్థలకు పెను భారం తగ్గుతుంది. ప్రతి ఆరు నెలలకోసారి పరీక్షలు నిర్వహిస్తారు. టాప్ ర్యాంక్ వచ్చిన వారు కోరుకున్నది లేదా ఐఏఎస్. వగైరా ఎన్నికవుతారు.. ఈ కేడర్ కటాఫ్ తరువాత గ్రూప్ వన్ కేడర్ గా తీసుకుంటారు. వారి కటాఫ్ తరువాత గ్రూప్ త్రీ, ఆ తరువాత గ్రూప్ ఫోర్. .. ఇలా ఎంపికైన వారిని బ్యాంకులు, రైల్వేలు, టెలిఫోన్, రేడియో దూర దర్శన్, రోడ్లు, ఇన్సూరెన్సు, ఫుడ్ కార్పొరేషన్ తదితర సమస్త సంస్థలకు ఎంసెట్ వలె వారి చాయిస్ తో కెటాయిస్తారు. వారికి ఆయా శాఖల్లో ఏడాది, రెండేళ్ల శిక్షణ ఇస్తారు. . శిక్షణ టైంలో స్టయిఫండ్ ఇస్తారు. ఇలా ఉద్యోగం దొరికిందని తొందరగా పెళ్లిల్లు చేసుకొని స్థిర పడుతారు.

## రిజర్వేషన్లు నింపుటకు నూతన వ్యవస్థ

పరీక్ష ఒకటే. కాని 50 శాతం రిజర్వేషన్ కేటగిరీ నియామకాల కొరకు ప్రత్యేక యుపియస్సీ, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు విడిగా స్వతంత్రంగా రాజ్యాంగ బద్ధంగా వుండాలి. అపుడే బ్యాక్ లాగ్ లేకుండా అన్ని పూర్తిగా నింపే ఏర్పాట్లు చేస్తారు.

### 9. ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా నియామకాలు:

దీని ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాలకు, ఆయా సామాజిక వర్గాలకు సమ న్యాయం, సమాన అవకాశాలు, సమాన ప్రాతినిధ్యం లభిస్తుంది. ఏటా ఒక ఎంపీ నియోజకవర్గం నుండి కనీసం ఇద్దరు సివిల్స్ కు ఎంపికవుతారు. తద్వారా కేవలం పదేళ్లలో ప్రతి నియోజకవర్గంలో 20 మంది

ఐఏఎస్ వంటి అధికారులు ఎంపికవుతారు. వారు ఏ రాష్ట్రంలో పని చేసినా తమ ప్రాంత అభివృద్ధి గురించి ఆలోచిస్తారు. టీచర్ పోస్టులు శాసన సభ నియోజకవర్గాల వారీగా ఎంపికలు జరుగుతాయి. ఒక నియోజకవర్గం అంతలేని దేశాలు ఎన్నో ఉన్నాయి. ఆ దేశంలో అవకాశాలు అన్నీ వారికే కద! కలిసి వుంటే నష్టపోవాలా? కాదు కద!? న్యాయ వ్యవస్థ లో పరిపాలన వ్యవస్థ లో ఈ ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ప్రాతినిధ్యం ఉండాలి. సైన్యం తదితర రంగాల్లో ఈ విధానం ప్రాతినిధ్యం ఉన్నపుడే దేశభక్తి వెల్లి విరిస్తుంది.

---

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ



### "రాస్తూనే ఉంటాను..."

రాస్తున్నా ఇలా...
కాగితం గుండె మీద కలం కన్నీటిని రాలుస్తూ
తడి ఆరని జ్ఞాపకాల్ని అక్షరాలుగా పేరుస్తూ.
రాస్తున్నా ఇలా...
నిశ్శబ్దం నిండిన రాత్రుల్లో నిట్టూర్పుల్ని వాక్యాలుగా మారుస్తూ,
మాట్లాడలేని మనసు మౌనాన్ని మాట్లాడిస్తూ.
రాస్తున్నా ఇలా...
బాల్యం దాచుకున్న బంగారు పిడతల్ని బద్దలుకొడుతూ,
చిన్ననాటి చిలిపి నవ్వుల్ని చుక్కలు చుక్కలుగా పొదుగుతూ.
రాస్తున్నా ఇలా...
ఎడారి లాంటి ఎదలో ఒయాసిస్సు కోసం వెదుకుతూ
ఎండిన కలల పాదుల్లో ఆశల విత్తులు నాటుతూ.
రాస్తున్నా ఇలా...
గాయపడ్డ గుండె గోడల మీద గేయాల మలాము పూస్తూ,
రక్తపు చుక్కల్నే సిరాగా మార్చి, బాధను కవిత్వం చేస్తూ.
రాస్తున్నా ఇలా...
కాలం చెరిపేసిన కాలిబాటల మీద నడుస్తూ
నా అడుగుల ముద్రల్ని పదాలతో తిరిగి తొక్కిస్తూ.
రాస్తున్నా ఇలా...
నేను చెప్పలేని నిజాలను బహిరంగ పరుస్తూ
అబద్ధాలు చెలామణి కాకుండా ఉండటానికి ప్రయత్నిస్తూ.
ఎందుకంటే రాయడం అంటే...
చావు మీద గెలిచిన గీత.
మౌనం మీద చేసిన సమరం.
నేను 'నేను'గా మిగిలిపోవడానికి వేసే సంతకం.
అందుకే, రాస్తున్నా ఇలా...
ఇలా రాస్తూనే ఉంటాను...
చివరి ఊపిరి వరకు, చివరి అక్షరం వరకు.

-నరహరి రావు బాపురం
9908656434

---

### రాస్తున్నాయ్ రాస్తున్నాయ్ గోపాలుని కలములు

సమాజంకొరకే పుట్టింది సాహిత్యం!
సమాజాన్ని లేపడానికే పుట్టింది సాహిత్యం!
సామాజిక కవికోడిపుంజునై అందుకే కూస్తున్నా!
రక్తాన్ని సిరాగా మార్చి రాత్రింబవళ్ళు రాస్తున్నా!.
పిల్లలో పెద్దలో గద్దెనెక్కిన గద్దలో..
ముగ్ధలో.. ముద్దలో.. మేధావులైన్ పప్పుసుద్దలో..
షూటర్లో.. ట్యూటర్లో.. అమాయకపు ఓటర్లో..
హీటర్లో.. చీటర్లో.. మోసపోతున్న దాటర్లో..
అందరికి హెచ్చరిక.. చరిత్రను తిరగ రాస్తున్నా..
మనుషుల కొరకే పుట్టింది సాహిత్యం!
మనసున్న మనుషులకై పుట్టింది సాహిత్యం!
మనసుల్లో కవితా మల్లియనై అందుకే పూస్తున్నా!
శ్వాసనే గుబాళింపుగా మార్చి నిత్యం రాస్తున్నా!
మగువలో.. తెగువలో.. మగనిలో సగములో..
తగువులో.. బిగువులో.. ఎగరలేని లఘువులో..
మందులో.విందులో మాదకద్రవ్యాల పొందులో..
పబ్బులో.. క్లబ్బులో.. పతితులైన గబ్బులో..
అందరికి ఖబడ్దార్! గవ్వ తిరగవేస్తున్నా!.
పురుషుల కొరకే పుట్టింది సాహిత్యం!
పుణ్యపురుషులకై పుట్టింది సాహిత్యం!
పురుషుల్లో కవికోకిలనై అందుకే కూస్తున్నా!
శిశిరంలో వసంతానికై ఎదురుచూస్తూ వ్రాస్తున్నా!.
మగువల కొరకై పుట్టింది సాహిత్యం
అందచందాలనుండి ఆవేశ కావేశాల వరకు
అబలలకు ప్రతినిధినై అన్నగా అరుస్తున్నా!
సుభద్రో ద్రౌపదో కవితావస్త్రాలను కలంతో నేస్తున్నా!.
కవుల కొరకై పుట్టింది సాహిత్యం
కవిపోషకుల కొరకై పుట్టింది సాహిత్యం!
ఉద్ధరిస్తాడో ఊరేగిస్తాడో ఊరుకోలేక రాస్తున్నా!
ఊరించే శయ్య ఉరితీసేకొయ్య.. రెండూ ఒకటే!
ఊరికోసం.. ఉసిగొల్పడానికి ఉరుమునై వస్తున్నా!.

-పొర్ల వేణుగోపాల రావు
ఎల్లారెడ్డిపేట, రాజన్న సిరిసిల్ల

---

### ప్రియా! ఎక్కడ నీ చిరునామా!

ప్రియతమా! ఎక్కడ నీ చిరునామా!
మనసు కంగారుపడుతోందిలా!
నీ తలపులతో కనురెప్పలు మూయడానికైనా
ఒప్పుకోవటం లేదు!.
కవితలతోనైనా నీ జ్ఞాపకాలను మదిలో తలచుకోవాలని
మనసు ఆరాటపడుతోందిలా
నీ కనులలోని చిరునవ్వు కదలాడగా
మధురమైన స్వరం వినాలని కోరుతోంది
నీ మధురస్మృతుల్లో మనసాగలేక క్షణమే యుగమై
తీయగా బాధిస్తోంది
తనివితీరా మాటాడడానికి
ఎన్ని వేలనిమిషాలు గడపాలో అని లెక్కపెట్టుకుంటోంది
ఎగిసిపడే కోరికల వెల్లువకు ఆనకట్ట వేయలేక
గమ్యం తెలియని పయనమయింది
ఆత్మీయత పల్లవించగా ఒక్కో అక్షరం మదిలోని
ఆశల తలుపు తడుతోంది
ఏమి మాయచేసావో కానీ అనుక్షణం
నీ తలపుల మాయలోనే క్షణమొక యుగమాయె
ప్రియా!ప్రేమగా పిలిచి తీయగా పలికి,
మనసును దోచి మాయజేసావు....
వలచి హృదయములోన
మమతానురాగాల పల్లకి నెక్కించి ఊహలలో ఊగించావు....
మధుర ప్రణయములోన
మది పులకింపజేసి స్నేహితగా మారావు!
మనసు తలపుల నిండి పల్లవించే బంధముతో
పరిమళింపజేసావు....
అనురాగమే పంచి
ఆరాధ్యదైవమై నిలిచి
జ్ఞాపకాలనిచ్చి కమనీయ కల్పనవైనావు!
ప్రణయపు మేఘం రావాలని
వలపుల వాన కురియాలని
ప్రేమ చిగురులు వేయాలనీ అనుకున్నా!
పరువపు సుమాలు విరియాలనీ మధురప్రయాణం
సాగాలనీ రాస్తున్నా ఇలా!

-పద్మ చిగురాల.
హైదరాబాద్.

---

## ఎగరని.. శాంతి కపోతం..!



భీకర యుద్ధానికి నేడు
తాత్కాలిక బ్రేక్ పడింది
రహస్య గదులలో దాచిన
దారుణాయుధాలు ఐపోయాయి
కారణం లేని రణానికి దిగిన
యుద్ధ మదాంధులకు పట్టపగలే
చుక్కలు కనిపిస్తున్నాయి...!
వినీల విశాలాకాశంలో
సూర్య చంద్రులు కనిపిస్తున్నారు
మేఘాల మధ్య ఎగురుతున్న
పక్షుల గుంపులను చూసి
క్షిపణులనుకుని శాంతి కాములకు భీతిల్లు తున్నారు..!.
యుద్ధకాండలో మూడు దేశాలకు
గూడులు చెదిరి పోయి
మేనులకు ముచ్చెమటలు పట్టాయి
గాయపడిన మూడు దేశాలు
చావు దెబ్బలు పైకి కనిపించకుండా
ఒంటికి దుశ్శాలువాలు కప్పుకొని తిరుగుతున్నాయి..!.
యుద్ధ బాధిత ప్రజలను
యమ పోరు రంధిలో పడి
ఎవ్వరూ పట్టించు కోవటం లేదు
తిండి తిప్పలు సరే... ముందు
పచ్చి మంచినీళ్లు దొరకక
ఎక్కడికో వలస పోతున్నారు
శాంతి ఒప్పందాలకు ఇద్దరూ
జల సంధిని దాటి రాలేక
షరతుల డ్రోనులను విసురు కుంటున్నారు..?.
యుద్ధకాండ మూడు దేశాలకే కాదు
వందల దేశాలకు దహనకాండగా మారింది
ఒక్కరిద్దరి ఆధిపత్యం కోసం
వందల కోట్ల ప్రజలకు
ఇంధనాలు దొరకక, ఉపాధి లేక
రోజు వారీ బతుకు బండి
అతి భారంగా నడుస్తోంది..!
యుద్ధకాండ లో మేమే గెలిచామని
కల్లబొల్లి కబుర్లను చెబుతుండగా
చమురు బావిలో బాంబులు పడి
మళ్లీ ఆరని మంటలు లేచాయి...!
ఈ యుద్ధానికి కొందరు ఆజ్యం పోస్తుండగా
మరి కొందరు మిలటరీ భోజ్యం విందులా
ఆరగిస్తున్నారు...!



-జి.సూర్యనారాయణ,
6281725659.మ



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

ఈ వారం కథల వర్క్ షాప్‌లో సంబరాజు రమణి "ధన దాహం" కథ చదవండి.

-డా॥రావి రంగారావు
9247581825

-సంపాదకులు

# ధన దాహం

కథ

అనన్య శరణ్య చాలా ఉత్సాహంగా పాఠశాలకు వెళ్ళటానికి సిద్ధం అవుతున్నారు. ఆ రోజుతో వారికి పదవ తరగతి పరీక్షలు పూర్తి అవుతాయి.

"పరీక్షలు అయిపోయినాయా బంగారు తల్లులూ... శెలవుల్లో ఏ ఊరు వెడదాం"? అంటూ కూతుళ్ళను పలుకరిస్తూ లోపలికి వచ్చాడు సివిల్ ఇంజినీర్ కార్తీక్.

కార్తీక్ కి కాఫీ అందిస్తూ "అరుణాచలం వెడదామండీ" అంది భార్య లోహిత.

"అమ్మ ఎప్పుడు చూసినా శ్రీశైలం, తిరుపతి, అన్నవరం అంటూ తీర్థయాత్రలకు తీసుకు వెడుతోంది నాన్నా..! ఈసారి మనం సరదాగా విహార యాత్రకు వెళ్ళాల్సిందే" అన్నారు అనన్య, శరణ్య.

"అయితే కూర్గ్ వెడదామా".. ? అన్నాడు. కార్తీక్.

యూట్యూబ్ వీడియో ఒకటి చూపిస్తూ "ఏవండీ! సుస్మిత అని "యూట్యూబర్" విహార యాత్రలకు సంబంధించి దేశ విదేశాల్లో చాలా వీడియోస్ చేసింది."

"అక్కడి అందమైన ప్రదేశాలను చాలా స్పష్టంగా, వివరంగా చూపిస్తూ, వసతి వివరాల సమాచారం కూడా ఇస్తుంది. నేను ఈమె సబ్ స్రైబర్ని"అంది లోహిత.

"అవును, నేను కూడా ఒకటి. రెండు వీడియోస్ చూశాను, చాలా బాగున్నయ్" అంటూ.. సుస్మిత వీడియోస్ సెర్చ్ చేసి జమ్మూ కాశ్మీర్ వెళ్ళాలని నిర్ణయించుకున్నారు అందరు.

"ఫ్లైట్ టైమవుతోంది. లగేజ్ సిద్ధం చేశారా." అన్నాడు కార్తీక్.

"అంతా సిద్ధంగానే ఉంది. పది నిముషాల్లో బయలుదేరుదామండీ"! అంది లోహిత.

ఇంతలో కార్తీక్ ఫోన్ రింగయింది. కార్తీక్ చెల్లెలు లాస్యతో ఫోనులోమాట్లాడుతున్నాడు.

"ఎవరండీ ఫోన్..? మేము రెడీ" అంటూ వచ్చింది లోహిత.

"లోహితా.. లాస్య ఫోన్ చేసింది. నా మేన కోడలు పుష్పవతి అయిందట. వెంటనే మనల్ని బయలుదేరి రమ్మంది. జమ్మూ ఇంకెప్పుడైనా వెళ్ళవచ్చు." అన్నాడు కార్తీక్.

"మనం ఇప్పుడే వెళ్ళి ఏం చేస్తాం నాన్నా.. వాళ్ళు గ్రాండ్ ఫంక్షన్ పెట్టుకున్న రోజు వెడదాంలే " అన్నారు అనన్య, శరణ్యలు.

"అలా అనకూడదమ్మా ... అత్తకి మనం కాక ఇంకెవరున్నారు? మనం వెళ్ళి అండగా నిలబడాలి కదా! ఒక్కత్తే పాపం ఇబ్బందులు పడుతుంది". అన్నాడు కార్తీక్.

"అవునండీ! ఇంటిపనులు, బయటి పనులు అన్నీ ఒక్కత్తే చూసుకోవాలి. వాళ్ళాయన దుబాయ్ నుంచి రావాలి కదా, మనం ఇప్పుడు వెళ్ళటవే మంచిది" అంది లోహిత.

"ఇప్పుడు అన్నీ ఆన్లైన్ లో ఆర్డర్ పెట్టుకుంటే వచ్చేస్తయ్, భోజనాలు ఎలాగు కాటరింగ్ ఇచ్చే స్తాం, ఇంకా అన్ని పనులు ఏముంటయ్, జమ్మూ నుండి వచ్చాక వెళ్దాంలే" అంటున్న పిల్లల గోడు వినిపించుకోకుండా చెల్లెలింటికి బయలుదేరాడు కార్తీక్ భార్యా, పిల్లలతో.

మేనకోడలి ఫంక్షన్ దగ్గరుండి ఘనంగా జరిపించాడు కార్తీక్. వచ్చిన బంధుమిత్రు లంతా శెలవు తీసుకోవటంతో భోజనాలు ముగించి టీవీ చూస్తూ సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు అందరూ.

ఇంతలో "బ్రేకింగ్ న్యూస్". "పహల్గాంలో విహార యాత్రకు వచ్చిన అమాయక జనులపై ఉగ్రవాదుల దాడి, పచ్చని లోయల్లో రక్తపుటేరులు" అంటూ విజువల్స్ చూపిస్తున్నారు.

కార్తీక్ తో సహా అందరికీ "ఒళ్ళు రుల్లు మంది". "మన టూర్ ప్రోగాం ప్రకారం ఆ సమయాన మనం కూడా పహల్గాంలోనే ఉండే వాళ్ళం. ఎంత పెద్ద ప్రమాదం తప్పింది? ఊహించుకుటుంటేనే వెన్నులో వణుకు పుడుతోంది" అంది లోహిత.

మరో "బ్రేకింగ్ న్యూస్"

"పహల్గాం దాడి వెనుక సూత్రధారి మరెవరో కాదు, ప్రముఖ "యూట్యూబర్ సుస్మిత". ధన దాహంతో ఉగ్రవాదులతో చేతులు కలిపి "దేశ దోహ్రం."

మన వీర సైనికుల స్థావరాలను, జాతీయ సంపదను, దేశ రహస్యాలను ఉగ్రవాదులకు చేరవేసిన పహల్గాం దాడి సూత్రధారి సుస్మిత... అంటూ స్క్రీన్ మీద "సుస్మిత "ఫోటో.

మరోసారి షాక్ అయ్యారు అందరూ.

"డబ్బు కోసం ఎంతకైనా దిగజారుతున్నారు. మాతృ మూర్తిని, మాతృభూమిని కూడా తాకట్టు పెట్టేస్తూ ధనార్జనే ధ్యేయమై, మానవత్యం మంట కలుపుతున్నారు." అంది కార్తీక్ చెల్లెలు లాస్య.

"పిల్లలకు పాఠశాల స్థాయి నుంచే ఏ కోర్సు చదివితే, ఎంత భారీ వేతనము పొందవచ్చు అనే తాపత్రయంతో, ఫాండేషన్ కోర్సులంటూ ఆట పాటలకి ఆస్కారమీయక , బట్టీ చదువులకు, రాంకులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు".

నైతిక విలువలతో కూడిన విద్య కరువైన నేటి సమాజాన డబ్బు ఎలా సంపాదిస్తున్నామన్నది ముఖ్యం కాదు, ఎంత సంపాదిస్తున్నా మన్నదానికే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ నిట్టూర్చాడు కార్తిక్."



- సంబరాజు రమణి
9550077219

# స్నేహశీలి ద్వా.నా.శాస్త్రి



కొంపెల్ల శర్మకి పురస్కారం ప్రదానం చేస్తున్న కొలకలూరి ఇనాక్. వేదికపై వల్లీశ్వర్, శైలజమిత్ర, కళా జనార్ధనమూర్తి, కిన్నెర రఘురాం శశికాంత్

హైదరాబాద్, జూన్ 17:(నేటినిజం ప్రతినిధి) ద్వా.నా.శాస్త్రి స్నేహశీలి, సహృదయుడని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, త్యాగరాయ గానసభ సంయుక్తాధ్వర్యంలో ప్రముఖ సాహిత్య విమర్శకుడు ద్వా.నా.శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని సోమవారం రాత్రి కళా సుబ్బారావు కళావేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగురథం సంపాదకుడు కొంపెల్ల శర్మకి కిన్నెర-ద్వా.నా.శాస్త్రి స్మారక పురస్కారం ప్రదానం చేసి మాట్లాడారు. ద్వా.నా.శాస్త్రికి తెలుగు భాషపై మక్కువ ఎక్కువన్నారు.

ఆయన విమర్శ సూటిగా ఉండేదన్నారు.

కార్యక్రమంలో ప్రముఖులు వల్లీశ్వర్, కళా జనార్ధనమూర్తి, శైలజామిత్ర, శశికాంత్, కిన్నెర రఘురాం తదితరులు పాల్గొన్నారు.



ఈనెల 13న పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత ప్రముఖ చలనచిత్ర గాయకుడు డా॥ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం గారి 80వ జయంతి వేడుకల సందర్భంగా చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక, నెల్లూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బాలూ సినీ చిత్ర గీతావళి కార్మక్రమంలో కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్‌ను సత్కరిస్తున్న తెలుగు చలనచిత్ర నటుడు శుభలేఖ సుధాకర్, గాయని ఎస్.పి.శైలజా దంపతులు.




## విలేకరి

నడిచే చైతన్యం అతడు
జగజాగృతమే ధ్యేయంగా
ఆత్మవిశ్వాసమే ఆయుధంగా
కలం పట్టిన కర్మయోగి.

సత్యశోధనే తపనగా
సామర్థ్యమే సంపదగా
యుక్తితో సంగతుల
నిగ్గుతేల్చే నిప్పుకణిక

సమస్యల వలయాన్ని
ఛేదించే నేర్పరి.

లొసుగుల తేనెతుట్టెను
తట్టిలేపే సాహసి.

పాతాళంలో దాగిన
గోపనాన్ని రట్టుచేసే దిట్ట.

అవినీతి ఊసరవెల్లుల
రాజ్యంలో
సవాళ్ళ ఎదురీతలో
ఏమరుపాటు లేక
సత్తువతో సాగే
నిత్యసంచారి.

చీకటి ముసిరిన బ్రతుకుల్లో
కాంతినింపే వెలుగుదివ్వె.

అందరివాడైన ఈ
అక్షర చాణక్యుడు
కొందరి గుండెల్లో
మోగే ఫిరంగి.



-రాధికా సూరి
సెల్:6305581278

## చల్లబడిన నేల

నాలుగు నెలలు నేలమీద
ఎండా బగబగ మంటూ
నడయాడి పోయింది...
ఇప్పుడే తల్లీ! వానమ్మా వచ్చి
బిడ్డ నేలను వాన కొంగుతో
ముఖాని తుడిచి చల్లబరిచింది
రైతు! కాలు ఆగడంలేదు

పాదరసంలా...
పొలమంతా కదలాడుతూ
చల్లబడిన
నేలమీద సల్లుతున్న విత్తనాలను
చూస్తూ ఆనందంతో
నాట్యం చేస్తున్నాడు!




-నాగం సాయిలు
9490209037

## నీకు నీవే తోడు

మాత గర్భం నుండి
భూమాత గర్భం దాకా
ప్రయాణం చిన్నదేమి కాదు
కొందరు కొంతదూరం కలిసి
నడిచినట్టు అనిపించవచ్చు.
కానీ,
అది ఒంటరి ప్రయాణమే
నీకు నీవే తోడు !
వేలు పట్టుకొని నడిపించిన ఇద్దరు
నీకు రెక్కలిచ్చి వాళ్ళెగిరిపోతారు

నీకు నీవే తోడు !!
రెక్కలు వచ్చిన పిల్లలు గూళ్ళు
వెతుక్కుంటూ వెళ్తారు
నీకు నీవే తోడు !!!
తాళి కట్టిన తోడు తుది దాకా
నడవాలని లేదు
నీకు నీవే తోడు !
నీకు నిన్ను మించిన తోడు లేదు
నీకు నీవే తోడు !!



- మార్కుల భాస్కర్ రెడ్డి
సెల్80088 22240:

# మధురంగా సంగీత విభావరి



జెన్నీకి జ్ఞాపిక ప్రదానం చేస్తున్న అతిథులు

హైదరాబాద్, జూన్ 17: స్వరఝరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకొని త్యాగరాయ గానసభలో సోమవారం నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. ప్రముఖ హాస్యనటుడు జనార్థన్‌రావు (జెన్నీ) ముఖ్య అతిథిగా గాయకుడు భవిడిపాటి దీక్షితులుకు బహుళ గాయకుడి బిరుదు, సామాజిక సేవకురాలు సంధ్యారాణికి సేవారత్న బిరుదు ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖులు ఎస్వీ రామారావు, జ్ఞానకుమార్, రామలక్ష్మి,రాజ్యలక్ష్మి, అపర్ణ, కామేశ్వరి, శ్యామల, ప్రశాంత్ వీఆర్కే ఫణి, వెంకటేశ్ పాల్గొన్నారు. శృతిలయలు సంస్థ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సిటీ కల్చరల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సమావేశంలో ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావు ముఖ్యఅతిథిగా పాల్గొని గాయనీ గాయకులను అభినందించి సన్మానించారు.

# కథలు సమాజానికి మార్గదర్శకాలు



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, జూన్ 17: బెహరా వెంకట సుబ్బారావు కథలు సమాజానికి మార్గదర్శకాలు అని వక్తలన్నారు.

ఆదివారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఎమెస్కో పబ్లిషర్స్‌ల ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత బెహరా వెంకటసుబ్బారావు సర్వ లభ్య రచనలు **'మధ్యతరగతి మందహాసం'** ద్వితీయ ముద్రణ ఆవిష్కరణ సభ జరిగింది. ఆధ్యాత్మికవేత్త, దైవజ్ఞ శర్మ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కవి, చిత్రకారుడు 'కళారత్న' బ్నిం మాట్లాడారు. సీనియర్ పాత్రికేయుడు, రచయిత గుండు వల్లీశ్వర్, డా॥సి. భవానీదేవి, రచయిత కొల్లూరి సోమశంకర్, పుస్తక సంపాదకుడు, ఎన్ఐసీ-జీఓఐ డిప్యూటీ డైరెక్టర్ బెహరా సత్యనారాయణ మూర్తి, ఎస్బీఐ విశ్రాంత సహాయ జీఎం కలిగొట్ల సన్యాసిరాజులు పాల్గొన్నారు.

## ఘంటారావం

సహనానాకి సరిహద్దులు
ఉంటాయని గుర్తించు
హద్దులు దాటితే
యుద్ధాలుంటాయని గ్రహించు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## బడి పరిమళిస్తుంది

బడి గంట మోగితే...
ఊరు ఊరు గల్లి గల్లి సందడే
బ్యాగులు భుజాన వేసుకుని
బడికి పోయే పిల్లలతో
ఉరుకులు పరుగుల అంగడే!.
ఇల్లు ఇల్లంతా పుస్తకాలతో
చదువుల సంగ్రామమే!
యూనిఫామ్ ఫీజులు రవాణా
సౌకర్యాలు సమకూర్చుటలో
తల్లిదండ్రుల సతమతమే !.
చదువుకునే బాల బాలికలతో
ఉపాధ్యాయులతో
బడి ప్రాంగణమంతా నిండుగా
చదువుల ఆటల పాటలు
బడి దరువులై ప్రతిధ్వనిస్తుంది!.
కొత్త కొత్త చిట్టి చిట్టి నేస్తాలు
మురిపాల సవ్వడుల సందోహాలు
బడులు తెరుచుకోగానే
బడి తెరువంతా
వచ్చిపోయే వాహనాల జాతరే !.
ఉపాధ్యాయుల బడిబాట
ఊతమిచ్చే ప్రతిజ్ఞా పాలన
గల్లి గల్లి గాలించి
బడికి రాని పిల్లలను ఒప్పించి మెప్పిస్తే
బడి పూల తోటై పరిమళిస్తుంది !.
(బడులు తెరుస్తున్న సందర్భంగా)

-పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

## గెలుపు

మనం ఎన్నిసార్లు ఓడితే
అన్నిసార్లు పాఠం నేర్చుకున్నట్టు
ఎన్నిసార్లు ప్రయత్నిస్తే
అన్నిసార్లు ఫలించినట్లు.
ఎన్నిసార్లు ఓడిపోయినా నిరాశపడకు
ఎన్నిసార్లు గెలిచినా గర్వపడకు
ప్రతి ఓటమిని
గెలుపుకు మెట్టులా చేసుకో
ప్రతి ఒక్కరూ నిన్ను చూసి నవ్వే వారే కానీ
ప్రోత్సహించేవారు ఎవ్వరూ ఉండరు.
పదిమంది మాటలను పట్టించుకోకు
ప్రతి ఒక్కరి మాటలను
గెలుపుకు ప్రోత్సాహమే అనుకో కానీ
బాధపడి జీవితాన్ని చీకట్లోకి తోసేయకు
నిన్ను చూసి నవ్విన వారికి
మాటలన్న వారికి తలెత్తి సమాధానం చెప్పు
నేను ఇన్ని రోజులు
తలదించి చదువుకున్నా కానీ
ఇప్పుడు నేను చదువు వలన
తలెత్తుకొని ప్రపంచం ముందు నిలబడ్డానని
గుర్తుంచుకో
నిన్ను ఇవాళ హేళన చేసేవాళ్లే
రేపు నువ్వు విజయం సాధించినపుడు
నిన్ను ప్రశంసల జల్లులో ముంచెత్తుతారు

- పద్మ భవ్యశ్రీ


## ఏదో ఒకరోజు

జీవిత ప్రయాణం
సముద్రంలో నౌకా ప్రయాణం లాంటిది
ఎన్నో అలలు నౌకను తాకినట్టు
మన జీవితంలో కూడా ఎన్నో కష్టాలు
మనకు స్వాగత గీతం పాడతాయి
అలలను జయిస్తేనే నౌక ఒడ్డుకు
కష్టాలను జయిస్తేనే జీవితం కడవరకు.
కష్టం వచ్చిందని కన్నీళ్లు కార్చుతూ
పిరికితనపు ముసుగులో దాక్కుంటావో
ధైర్య సాహసాలతో ముందడుగు వేస్తావో నీ ఇష్టం
జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు
అలా ఉంటే అసలు అది జీవితమే కాదు
మనం ఓ దారిలో ప్రయాణిస్తున్నప్పుడు
ఎన్నో ఎత్తు వంపులు రాళ్లూ,ముళ్ళు ఎదురవుతాయి
అలాంటిది ఇదొక జీవిత ప్రయాణం
ఇంకెన్నెన్నో ఆటంకాలు నీకెదురవుతాయి
అక్కడే ఆగుతావో నీ గమ్యానికై ప్రయాణం సాగిస్తావో
అది నీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.
బాధలో ఉన్నప్పుడు నిర్ణయాలు తీసుకోకు
అవి నీకు బాధనే మిగుల్చుతాయి
నువ్వెందుకు ఓడిపోవు అని
కాలాన్ని ఓ సారి ప్రశ్నించు
నేను ఎలాంటి కఠినమైన పరిస్థితి వచ్చినా
నడుస్తూనే ఉంటానని సమాధానమిస్తుంది
నువ్వు కూడా కాలంతో నడిచి చూడు
ఏదో ఒక రోజు నిన్ను విజయం తప్పక వరిస్తుంది.

- కుమ్మరి అక్షయ


## అభ్యసించాల్సిన ఆదర్శ పాఠం

మగువల మృదుఎదలోని మనోవేదన
తమ కళ్ళ నుండి కట్టలు తెంచుకున్నా
కన్నీటి ధారలై
మాధుర్యాలను కురిపించే
చిరునవ్వులు కరువు కాగా
ఎడబాసిన బుగ్గల ఎరుపు.
తమ జీవన సంద్రంలోని అడ్డంకుల అలలు
ఎప్పుడు ఏ సమస్యల తుఫానులను
రేగెత్తిస్తాయో అని
స్వీయహృదయాన్ని వెంటాడిన ప్రశ్నలు.
క్షణక్షణం కంటి రెప్ప దిగువలో
కదలాడే కష్టాలు
హృదయతార ఆనంద మెరుపులేక
స్వేచ్ఛ తళుకులకు తనతో చెలిమికి
తావు లేక మూగబోయిన పలకరింపులు.
తనకు నలుగురిలో లభించిన సంపద
తన మంచితనపు ప్రభావం
నాలుగు గోడల మధ్య స్వజనుల సన్నిధిలో
తమ గౌరవమకుటం విరిగి ముక్కలై
కృష్ణబిలం చీకట్లోకి పడడం
ఇప్పటికీ వేదిస్తోంది.
తమ జీవనజ్యోతిని వెలిగించే విద్యకు
ఇప్పటికీ దూరమౌతున్న స్త్రీలెందరో
తన స్వావలంబన
భువికి చేరని చినుకయ్యింది
అయినా వనిత జీవితపు సహనం
లోకం అభ్యసించాల్సిన ఆదర్శ పాఠమైంది

-యం.స్పందన

## మిగిలే ఉంటాను

నాకు ఒక ప్రయాణం
చేయాలని ఉంది
అది ఎటువంటిదంటే
నాదైన ప్రయాణం
నాతో ఉండే, నిలిచిపోయే ప్రయాణం
జీవిత యాత్ర అంతా నాదే
నేనే దిశ , దిక్సూచి నాదే నావ
నన్ను నేను నడుపుకోవాలి నిలుపుకోవాలి
అందుకుగాను ఒక భాగమయ్యే కవితనయి
ఈ సమాజాన్ని సాహిత్యంలో మిళితం చేయాలి
నాకొక కట్టుబాటు ఉంది
దానికి ఆదర్శవంతమైన నియమం ఉంది
ఇదే నేను నా దేశం
సంకెళ్ళు బందీ చేయలేని
నిర్లిప్త ప్రపంచానికి నిలువెత్తు దిక్సూచి
అందుకే మీరెంత తవ్విన అందులోను
మళ్ళీ పుట్టుకొస్తాను
చరిత్ర మొదలవుతుంది నాతోనే
దారంలా అల్లుతాను దండనవుతాను
ఎన్ని యుగాలు జరగని అక్షరంలా
మిగిలే ఉంటాను

-కె. భానుజ



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు

## మా వెంటరాని వారే

అంటరాని వారెవరంటే
మా వెంట రానివారే
అవినీతి పరులేనురా .....
సత్యాన్ని సహించక
అసత్యం తొడుగేసుకుని
అబద్ధపు మాటలతో
అలవోకగ నమ్మించి.
వమ్ముజేసెటోల్లే
అంటరాని వారెవరంటే
మా వెంట రానివారే
అవినీతి పరులేనురా.
సర్కారు నౌకరుండి
సంతృప్తి చెందక
లంచానికి మంచమేసే
అపర ఆశపరులే.....
అంటరాని వారెవరంటే
మా వెంట రానివారే
అవినీతి పరులేను రా.
ప్రజల సొమ్ము రుణాలతో
ఖజానాకు గండికొట్టి
సేవే మామార్గమంటు
సంస్థలను స్థాపించి
రాయితీలను కొల్లగొట్టే
అంటరాని వారెవరంటే
మా వెంట రానివారే
అవినీతి పరులేను రా.
సర్వ మానవాళి ఉన్నతికై
జనుల సొమ్మునే
మూల పెట్టుబడులుగ పెట్టి
అధిక లాభాల అత్యాశతో
శ్రామికుల కడుపు కొట్టి
పాపంత మూటగట్టుకొని
తమ ఎగుదలకు మూలం
కార్మిక శక్తే ననిమరచి.
అంటరాని వారెవరంటే
మా వెంటరాని వారే
అవినీతి పరులేనురా.
శ్రమించే దేవుళ్లకు
అన్యాయం చేసి
కనిపించని దేవుళ్లకు
కానుకలే చెల్లించే
అంటరాని వారెవరంటే
మా వెంట రానివారే
అవినీతి పరులేనురా..

-కల యాదయ్య
9866468979

## ఏదో ఒకరోజు

జీవిత ప్రయాణం
సముద్రంలో నౌకా ప్రయాణం లాంటిది
ఎన్నో అలలు నౌకను తాకినట్టు
మన జీవితంలో కూడా ఎన్నో కష్టాలు
మనకు స్వాగత గీతం పాడతాయి
అలలను జయిస్తేనే నౌక ఒడ్డుకు
కష్టాలను జయిస్తేనే జీవితం కడవరకు.
కష్టం వచ్చిందని కన్నీళ్లు కార్చుతూ
పిరికితనపు ముసుగులో దాక్కుంటావో
ధైర్య సాహసాలతో ముందడుగు వేస్తావో నీ ఇష్టం
జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు
అలా ఉంటే అసలు అది జీవితమే కాదు
మనం ఓ దారిలో ప్రయాణిస్తున్నప్పుడు
ఎన్నో ఎత్తు వంపులు
రాళ్లూ,ముళ్ళు ఎదురవుతాయి
అలాంటిది ఇదొక జీవిత ప్రయాణం
ఇంకెన్నెన్నో ఆటంకాలు నీకెదురవుతాయి
అక్కడే ఆగుతావో నీ గమ్యానికై ప్రయాణం సాగిస్తావో
అది నీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.
బాధలో ఉన్నప్పుడు నిర్ణయాలు తీసుకోకు
అవి నీకు బాధనే మిగుల్చుతాయి
నువ్వెందుకు ఓడిపోవు అని
కాలాన్ని ఓ సారి ప్రశ్నించు
నేను ఎలాంటి కఠినమైన పరిస్థితి వచ్చినా
నడుస్తూనే ఉంటానని సమాధానమిస్తుంది
నువ్వు కూడా కాలంతో నడిచి చూడు
ఏదో ఒక రోజు నిన్ను విజయం తప్పక వరిస్తుంది.

- కుమ్మరి అక్షయ

## జీవితంలో

జీవితం ప్రయాణం సాగిపోతున్నప్పుడు
అడుగడుగునా కష్టాలు
తీగలాగ నిన్ను చుట్టుముట్టొచ్చు
అయినా దేనికీ భయపడకూడదు
నీ విజయానికి ఎప్పుడో ఒకప్పుడు
పూలన్నీ స్వాగతం పలుకుతాయి
వాడిపోయిన పువ్వులా ఉండకు
విచ్చుకుంటున్న పువ్వులా ఉత్సాహంగా
ఉండు
నీ సంకల్పం కోసం
తాబేలులా కాకుండా పులిలా పరుగులు
తీస్తే
నీవు అనుకున్నది సాధిస్తావు
మనిషి జీవితంలో ఏదో ఒక రోజు
ప్రయత్నమనే విత్తనం మొలకెత్తాలి

- పి.మృదుల

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at
SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.